
ఆదివారం

# వార్త

3 డిసెంబరు, 2023


# కృత్రిమ మేధతో కొత్త వికారం





‘అఖండ’, వీరసింహారెడ్డి’, ‘భగవంత్ కేసరి’ సినిమాలతో బాలకృష్ణ హ్యాట్రిక్ హిట్ అందుకున్నారు. బాలకృష్ణ తన తరువాతి సినిమాను బాబీ దర్శకత్వంలో చేయనున్నారు. కెరియర్ పరంగా ఈ చిత్రం ఆయనకు **109**వ సినిమా అవుతుంది. సితార నాగవంశీ నిర్మిస్తున్న ఈ సినిమా యాక్షన్, ఎమోషన్స్‌ను కలుపుకుంటూ బాలయ్య మార్కులోనే సాగుతుందనే టాక్ వినిపిస్తోంది. ఈ సినిమాలో కథానాయికలుగా ఎవరిని తీసుకుంటారా? అన్న నేపథ్యంలో త్రిష, మీనాక్షి చౌదరి పేర్లు తెరపైకి వచ్చాయి. గతంలో బాలయ్యతో కలిసి త్రిష ‘లయన్’లో నటించింది.

# బాలకృష్ణ జోడీగా ఇద్దరు కథానాయికలు?

తారాతీరం





ప్రభాస్ హీరోగా రూపొందిన ‘సలార్’ చిత్రం ప్రేక్షకుల ముందుకు రావడానికి సిద్ధమవుతోంది. ఆ తరువాత సినిమాలుగా ‘రాజా డీలక్స్’, ‘ప్రాజెక్ట్ కె’ లైన్లో ఉన్నాయి. ‘కన్నప్ప’ సినిమాలోను ప్రభాస్ ఒక ముఖ్యమైన పాత్రలో కనిపించనున్నాడు. ఈ నేపథ్యంలోనే ప్రభాస్ మరో ప్రాజెక్టును అంగీకరించినట్లు తెలుస్తోంది.

హను రాఘవపూడి ఒక కథ చెప్పి ప్రభాస్‌ను ఒప్పించినట్టుగా సమాచారం. ‘సీతారామం’ సినిమాతో పాన్ ఇండియా స్థాయిలో మంచి గుర్తింపు తెచ్చుకున్న హను రాఘవపూడి ఆ తరువాత సినిమా ప్రభాస్‌తో చేయనున్నాడని వినికిడి. ఈ కథ రెండో ప్రపంచ యుద్ధం నేపథ్యంలో ఉంటుందని తాజా సమాచారం. రెండో ప్రపంచ యుద్ధ నేపథ్యం అనగానే ఇది భారీ బడ్జెట్ చిత్రమనీ, పాన్ ఇండియా కంటెంట్ అనే విషయం అర్థమవుతోంది. బాలీవుడ్‌లోని ఓ బడా

# ప్రభాస్ హీరోగా పాన్ ఇండియా చిత్రం!

నిర్మాణ సంస్థతో కలిసి యూవీ క్రియేషన్స్ వారు నిర్మించనున్నట్లు తెలుస్తోంది. ఈ చిత్రంలో కథానాయిక ఎవరనే విషయం అందరిలో ఆసక్తిని కలిగిస్తోంది.

ఆదివారం వార్త

3 డిసెంబరు, 2023

## మంచి ముత్యాలు

ప్రేమ అంధురాలు కావచ్చు కాని, వివాహం వల్ల దృష్టి తిరిగి వస్తుంది. మనం ప్రేమించేవాళ్లకు దూరమవటం మరణం కంటే బాధాకరం.

- విలియం కూర్

## విషయ విశేషం


గల్ఫ్ దేశాల్లో ఉన్నత విద్య.. 4

'సంఘీ'భావం....5

ఐదేళ్ల హామీల అమలు గగనమే

కవర్ స్టోరీ..6

కృత్రిమ మేధతో

కొత్త వికారం

ఔషధాల సీతాఫలం...10

ఈవారం కవిత్వం..12

ఎలా మొదలౌతుందో..

వణికించే చలిలోనూ మెరిసిపోదాం....14

కథ.. 20

గురుబ్రహ్మ

సాహిత్యం..24

'ప్రజల మనిషి' ఆళ్వారుస్వామి

మృదు నైపుణ్యాలు...25

ఆగ్నేయంలో ఇల్లు నిర్మించవచ్చా?...29

ఇంకా..

పుస్తక సమీక్ష

మొగ్గ

వారఫలం

వగైరా..వగైరా..


# తాజా వార్తలు

## విద్యార్థుల సేవలో టీచర్



ఉద్యోగం నుంచి రిటైర్ అయ్యాక చాలామంది విశ్రాంతిగా కుటుంబంతో ఆనందంగా గడుపుతుంటారు. కొందరు మాత్రం ఖాళీగా ఉండటమెందుకని ఏదో ఒక పనిచేస్తుంటారు. ఒడిశాలోని కుజంగి తాలూకా కెలపద గ్రామంలోని పశ్చిమేశ్వర్ ప్రభుత్వ పాఠశాలలో పనిచేసి పాతికేళ్ల క్రితం రిటైర్ అయిన టీచర్ చింతామణి రౌత్ కూడా అలానే ఆలోచించాడు. పదవీ విరమణ తరవాత కూడా అదే స్కూల్లో స్వచ్ఛందంగా పనిచేస్తున్నాడు. పిల్లలకు విద్యాబుద్ధులు నేర్పించడంతోపాటు వారి బాగోగులు కూడా చూసుకుంటున్నారు. చదువుతోపాటు వ్యవసాయాన్ని కూడా ప్రేమించే చింతామణి విద్యార్థులకు పోషకాహారం అందించాలనే లక్ష్యంతో అదే గ్రామంలో తనకున్న ఆరెకరాల పొలంలో కాయగూరలూ, పండ్లూ సాగు చేస్తున్నాడు. ఆ స్కూల్లో చదువుకుంటున్న దాదాపు 200 మంది విద్యార్థుల మధ్యాహ్న భోజనానికి కాయగూరలు అందిస్తుంటాడు. అలానే పిల్లలకి విరామ సమయంలో తోట నుంచి పండ్లు తెప్పించి పంచిపెడుతుంటాడు. సాయంత్రం పూట పిల్లలకు ఉచితంగా ట్యూషన్లు కూడా చెబుతుంటాడు. ఎవరైనా పిల్లలు బడిమానేస్తే కారణాలు తెలుసుకుని వారి సమస్యలు తీర్చి మళ్లీ వారు తరగతులకు హాజరయ్యేలా చేస్తుంటాడు చింతామణి.

### అందరి భవిత కోసం

పెట్రోలు, డీజిల్ వంటి వాటి వాడకంతో భూమివేడెక్కిపోతోంది. రుతువులు గతి తప్పుతున్నాయి. ఈ విపత్తును కేవలం ప్రభుత్వమే అడ్డుకోవాలనుకోవడం పొరబాటు. ఈ విషయంలో ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పించి గ్రీన్ ఎనర్జీపై సమాజాన్ని చైతన్యపరచడానికి ముందుకొచ్చాడు ఐఐటీ బోంబే ప్రొఫెసర్ చైతన్య సింగ్ సోలంకి.




పదేళ్లపాటు ఉద్యోగానికి సెలవుపెట్టిన చైతన్య..సౌరవిద్యుత్తుతో నడిచే ఓ బస్సును తయారు చేయించుకున్నాడు. 'ఎనర్జీ స్వరాజ్' యాత్ర పేరిట అందులోనే దేశమంతటా ప్రయాణిస్తూ విద్యార్థులకు కర్బన ఇంధనం వల్ల నష్టాలను వివరిస్తూ సహజ వనరుల గురించి అవగాహన కల్పిస్తున్నాడు. దేశంలోని సాధ్యమైనన్ని గ్రామాలనూ చుట్టిరావాలనుకుంటున్నాడు. గతంలో చైతన్య ప్రొఫెసర్‌గా పనిచేస్తూనే మహారాష్ట్రలోని ఓ గ్రామాన్ని దత్తత తీసుకున్నారు.

మీ రచనల్ని ఈ మెయిల్ చిరునామాకు పంపగలరు. sunmagvaartha@gmail.com



# గల్ఫ్ దేశాల్లో ఉన్నత విద్య

ఈ.ఎస్.మాధవన్

**కనుచూపు** మేరలో కానరాని నీడ, కాలికింద వేడెక్కిన ఇసుక నెత్తిమీద మండే సూరీడు, గుక్కనీరు కోసం పడే తపన మీకు తెలిసిపోయింది గల్ఫ్‌దేశం గురించే అని. ఇక్కడ భాష మతం వాతావరణ అన్నీ మనకి భిన్నమైనవి అయినా మనదేశ వాసులకి యుఏఈ అని పిలవబడే యునైటెడ్ అరబ్ దేశాలు ఎంతో చిరపరిచితం. గల్ఫ్ దేశాలలో చమురు తీయడం తరువాత ఆర్థికంగా ఎదిగింది. అందులో లక్షలాదిమంది మన కేరళవాసులు ఉంటే, ఇప్పుడిప్పుడే మన తెలుగువారు అక్కడ స్థిరపడుతున్నారు. మనదేశం నుండి ఉన్నత విద్యాభ్యాసం కోసం గల్ఫ్‌దేశాల వైపు అంతగా చూడడం లేదు విద్యార్థులు. దీనికి కారణం సరైన అవగాహన లేకపోవడమే అని చెప్పవచ్చు. మరి యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ అని పిలవబడే దేశంలో ఇప్పుడు ఉన్నత విద్యాభ్యాసం చెప్పే పలు విశ్వవిద్యాలయాలు పేరు పొందాయి. అక్కడ కుటుంబంతో స్థిరపడినవారు తమ పిల్లల కోసం ఎన్నో పాఠశాలలు నడిపిస్తున్నారు. మన విదేశీ మంత్రాలయం లెక్క ప్రకారం 2023లో సుమారు లక్ష అరవైవేలమంది విద్యార్థులు చదువుతున్నారు. అబుదాబి, దుబాయ్, షార్జా, అజ్మన్, ఉమ్ముల్లువైన్, ఫుజేరా, రాసల్‌కైమా అనే ఏడు దేశాలు కలిసి యుఏఈ అని పిలుస్తారు. ఇక్కడి జనాభాలో సుమారు ముప్పైశాతం మనదేశస్తులు ఉంటారు. ఇక్కడ ముఖ్యవనరులు పెట్రోలియం. వాటి అనుబంధ ఉత్పత్తులు, వ్యాపార లావాదేవీలు చాలా జరుగుతాయి. టూరిజం కూడా మంది ఆదాయం ఇంకా ఇంఫర్మేషన్ ఇన్‌టెక్నాలజీ రంగాలు ఎంతో బిజీగా ఉండే విమాన, నౌకాకేంద్రాలు వెరసి ఆర్థికంగా పటిష్టంగా ఉన్న దేశం యుఏఈ. మనదేశం నుండి భారీగా వలస వెళ్తున్న దేశం దుబాయ్ కానీ చదువు కోసం అక్కడ అంత శ్రద్ధ మన విద్యార్థులు చూపడం లేదు. దీనికి కారణం ఆధునిక విద్యా సౌకర్యాలు లేవు అనే భావన ఉంది. కేవలం పెట్రోలు మీద ఆధారపడితే కాదు అని ఇతర రంగాలవైపు అడుగు పెట్టింది యుఏఈ. అందులో ఒకటి ఆధునిక విద్యారంగం, ప్రయోగాలు. భవిష్యత్తు పూర్తిగా ఆధునిక విజ్ఞానం వైపు ఉంది అని తెలుసుకున్న అరబ్‌దేశవాసులు కొత్త ఆలోచనల కోసం అడుగులు వేశారు. అందుకే విదేశీ విద్యార్థులను తమదేశంలోకి ఆకర్షించ బడేందుకు ఎన్నో సౌకర్యాలు కలిగించారు.

అందులో ఒకటి గోల్డెన్ వీసా. సినీమాతారలు, ప్రముఖులు గోల్డెన్ వీసా పొందడం మనం వార్త వింటుంటాం. తమ దేశంలో వ్యాపారం విద్య కళారంగం వంటి వాటిలో ప్రతిభ చూపినవారికి తమ దేశంలో ఉండి వారు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా, ఎన్నో రాయితీలు పొందడం గోల్డెన వీసా ద్వారా జరుగుతుంది. తమతమ రంగాలలో నిష్ణాతులైన వారికి గోల్డెన్ వీసా ఇచ్చి యుఏఈ ప్రోత్సహిస్తోంది. గోల్డెన్‌వీసా పొందడం ఒక పెద్ద గుర్తింపు. ఈమధ్యనే తమ ఇమ్మిగ్రేషన్ విధానాలను సరళీకృతం చేసి గోల్డెన్ వీసాని ప్రవేశపెట్టారు. గోల్డెన్‌వీసా జారీ వలన తమ దేశానికి ఎంతో మేలు అభివృద్ధి కలుగుతుంది అని అరబ్ ప్రభుత్వం ఆలోచన. గోల్డెన్ వీసా ఎక్కువగా మనదేశస్తులే పొందారు.

**(మిగతా 15వ పేజీలో)**



## ‘సంఘీ’ భావం



# ఐదేళ్ల హామీల అమలు గగనమే

ఎన్నికల ఓట్ల లెక్కింపు ఫలితాలు సాయంత్రంలోగా వెల్లడి అవుతాయి. ఏదో ఒక పార్టీ అధికారంలోకి వస్తుంది. ఓటర్ల తీర్పు ఏ విధంగా ఉందన్న విషయం తేటతెల్లమౌతుంది. అయితే ఏ పార్టీ అధికారంలోకి వచ్చినా ఐదేళ్ల పాలనలో ఆర్థిక సమస్యలు చుట్టుముట్టడం తప్పనిసరిగా కనిపిస్తోంది. ఇప్పటికే ప్రభుత్వ ఖజానాలో నిధులు నిండుకున్నాయి. ప్రభుత్వ ఉద్యోగులకు ఒకటవ తేదీనాటికి జీతాలు వేయడమే ఇబ్బందికరంగా పరిణమించింది. మరోపక్క పనులు పూర్తి చేసిన కాంట్రాక్టర్లకు బిల్లులు కూడా మంజూరు చేయలేని పరిస్థితి నెలకొంది. సరే ఇవన్నీ ఏదోవిధంగా సర్దుబాటు చేసుకోవచ్చు. దుబారా, అనవసర ఖర్చులు తగ్గించుకోవడం ద్వారా గట్టెక్క వచ్చని భావిస్తున్న తరుణంలో ఎన్నికల హామీలను అమలు చేసేది ఎలా అన్నది సమస్యగా మారుతోంది. ఓట్ల కోసం కాంగ్రెస్, బిఆర్ఎస్ పార్టీలు తహతుకు మించి హామీలు గుప్పించారు. ఇప్పటికే అభివృద్ధి కార్యక్రమాలకు వెచ్చించాల్సి న మొత్తాలను ఉచితాలకు సరిపెడుతున్నారు. అయినా నిధులు సరిపోవడం లేదు. రైతు బంధు కింద ఎకరానికి పదివేల రూపాయలు ఇవ్వడమే సమస్యగా మారిన తరుణంలో కాంగ్రెస్ పార్టీ మరో ఐదువేలు, బిఆర్ఎస్ మరో ఆరు వేలు పెంచుతామని హామీలు ఇచ్చారు. ఇది కాకుండా దళిత బంధు పథకం గుది బండగా ఉంది. దానిని అమలుచేయలేని పరిస్థితి ఉంది. హుజురాబాద్ ఎన్నికల్లో దళితుల ఓట్ల కోసం చేసిన ప్రకటనను నిలబెట్టుకునే పరిస్థితి లేదు. డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణానికి దిక్కూదివాణం లేదు. సన్నబియ్యం రేషన్ షాపుల్లో ఇస్తామని చెబుతున్నా నిధుల కొరత వెంటాడటంతో ఎటూ పాలుపోని స్థితిలో ప్రభుత్వం ఉంది. ఇలాంటి తరుణంలో రెండు పార్టీలు లెక్కకు మించి హామీలు గుప్పించాయి. రైతు బంధు కింద పది వేల రూపాయలు ఇవ్వడానికి ఇప్పటికే ఏటా 15 వేల కోట్ల రూపాయలు బడ్జెట్‌లో కేటాయించాల్సి న పరిస్థితి ఉంది. ప్రస్తుతం ఇచ్చిన హామీ ప్రకారం రైతు బంధు ఇవ్వాలంటేదాదాపు 22 నుంచి 25 వేల కోట్ల రూపాయలు కేటాయించాలి. ప్రస్తుతం రాష్ట్ర బడ్జెట్ సుమారుగా మూడు లక్షల కోట్ల రూపాయలుగా ఉంది. ఎన్నికల్లో ఇచ్చిన అన్ని హామీలు ఎలాంటి ఆంక్షలు లేకుండా యధాతథంగా అమలుచేయాలంటే కనీసం తక్కువలో తక్కువ అంటే మరో లక్ష కోట్లు అవసరం అవుతాయి. తెలంగాణ వచ్చిన తరువాత 8 ఏళ్లకు గాని బడ్జెట్ రెట్టింపు కాలేదు. అలాంటిది ప్రభుత్వం డిసెంబరు నెలాఖరుకు గాని, జనవరి మొదటి వారంలో గాని ఏర్పడితే మరుసటి నెల నుంచి ఆదాయాన్ని కనీసం 30 నుంచి 40 శాతం పెంచుకోవాలి. ఇది ఏమాత్రం సాధ్యం కాని పరిస్థితి. పథకాలు అమలుచేయాలంటే కొత్త పన్నులను ప్రజలపై రుద్దాల్సి ఉంటుంది. ఆసరా కింద ప్రస్తుతం ప్రభుత్వం 2,016 రూపాయలను ఇస్తోంది. దీనిని నాలుగు వేలకు పెంచుతామని ప్రకటించారు. అదేవిధంగా అర్హత వయస్సును 57 సంవత్సరాలకు తగ్గించారు. తెలంగాణ వ్యాప్తంగా 53 లక్షల 10 వేల మంది పింఛన్ పొందుతున్నారు. దీనికో ఏటా 12 వేల కోట్లు ఖర్చు పెడుతున్నారు. పింఛను మొత్తం పెంచి. వయస్సు తగ్గిస్తే సుమారు 22 వేల కోట్ల రూపాయలు అవసరం అవుతాయని ప్రభుత్వ అధికారులు స్పష్టం చేస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ మహాలక్ష్మి పథకం కింద ప్రతి మహిళకు నెలకు రెండు వేల 5 వందల రూపాయలు ఇస్తామని ప్రకటించింది. ఆర్టీసీ బస్సుల్లో రాష్ట్రవ్యాప్తంగా మహిళలు ఉచితంగా ప్రయాణించే సౌకర్యం కల్పిస్తామని ప్రకటించింది. వెయ్యి రూపాయిలుగా ఉన్న వంట గ్యాస్ సిలండర్‌ను 5 వందల రూపాయలకు ఇస్తామని మేనిఫెస్టోలో పేర్కొంది. ఈ హామీలు అమలుకావాలంటే మరో ఏడు వేల రూపాయలు అవసరం అవుతాయి. ఇప్పటికే ఆర్టీసీ సంస్థ అప్పుల్లో కూరుకుపోయింది. కార్మికులు జమ చేసుకున్న మొత్తాన్ని సైతం పక్కదారి పట్టించారని కార్మికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బస్సు ఛార్జీలు సామాన్యులకు అందనంత ఎత్తులో ఉన్నాయి. హైదరాబాద్ సిటీ బస్సు రేట్లు రెట్టింపుగా పెంచారు. ఈ తరుణంలో ఉచిత ప్రయాణాల అవకాశం ఎలా ఉంటుందో అర్థం కాని పరిస్థితి. మరోపక్క ప్రస్తుతం వస్తున్న ఆదాయం ఇప్పటికే అమలులో ఉన్న పథకాలను కొనసాగించలేని పరిస్థితి ఉంది. దళిత బంధుకే దిక్కులేకపోగా బిసి బంధు, మైనారిటీ బంధు డిమాండ్లు ప్రారంభమయ్యాయి. గతంలో తమ ప్రాంతంలో మార్కెట్ యార్డు గాని, రహదారులు కాని. కోల్డ్ స్టోరేజీలు కాని నిర్మించమని డిమాండ్ చేసే వారు. లేకపోతే తమ కులానికి సంబంధించి కమ్యూనిటీ హాలు నిర్మాణం చేయమని కోరేవారు. నీళ్ల సమస్య ఉన్న ప్రాంతాల్లో వాటర్ ట్యాంకును, పైప్ లైన్లు వేయమని, డ్రైనేజీలు కట్టాలని వత్తిడి చేసే వారు. ఇప్పుడు డిమాండ్లు మారాయి. ఉచితంగా నగదు బదిలీ చేయాలని అడుగుతున్నారు. ఇలాంటి నగదు బదిలీలు ఎన్ని సంవత్సరాలు చేసినా అభివృద్ధి ఉండదు. అదే ఒక కమ్యూనిటీ హాలు నిర్మిస్తే మరుసటి సంవత్సరం డ్రైనేజీలు నిర్మించవచ్చు. లేదా సాగునీటి వనరులను అభివృద్ధి చేయవచ్చు. నగదు బదిలీ వల్ల ఆయా కుటుంబాలకు మాత్రమే ప్రయోజనం ఉంటుంది. రైతు బంధు కింద 10 వేల రూపాయల చొప్పున 10 ఎకరాలకు లక్ష రూపాయలు ఒక రైతుకు అందుతుంది. అయితే వ్యవసాయ రంగానికి చేయాల్సి న మౌలిక వసతులు మాత్రం కల్పించే అవకాశం ఉండదు. సిద్ధాంతాలు అనుసరించడం పోయి వ్యూహాల వెనుక పరుగులు మొదలు పెట్టడంతో ఎన్నికల్లో వేల కోట్లు ఖర్చు అవుతున్నాయి. ఇప్పటికైనా ఉచితాలను ఫుల్‌స్టాప్ పెట్టేందుకు అటు సామాజిక వ్యవస్థలు, మేధావులు రంగంలో దిగాల్సి న అవసరం ఉంది.

**– డాక్టర్ గిరీష్‌కుమార్ సంఘీ**



# కృత్రిమ మేధతో కొత్త వికారం


కవర్ స్టోరీ

సుంకవల్లి సత్తిరాజు

**పఆశ** మనిషిని అవకాశాల తీరాల వైపు నడిపిస్తుంది. ప్రయత్నం ఫలితాలకు పునాది వేస్తుంది. ప్రయత్నం, పట్టుదల కలయికతో ఈ భూ ప్రపంచంలో ఎన్నో మార్పులు సంతరించుకున్నాయి. మానవ జీవితం అనేక మలుపులు తిరిగి అద్భుతమైన ప్రపంచాన్ని ఆవిష్కరింప చేసింది. ఆశ నిరాశల మధ్య జరిగే మానసిక సంఘర్షణలో ఆశావహ దృక్పథం, సకారాత్మక ధోరణులు సత్ఫలితాలని స్తాయనే నమ్మకంతో, దృఢ సంకల్పంతో శ్రమించి, అనుకున్న లక్ష్యాలను సాధించిన మానవజాతి సకల జీవరాశుల్లో అత్యున్నత మైన స్థానం అలంకరించింది. ఆశ మనిషి ఊపిరిని నిలబెడు తుంది. అత్యాశ పతనాన్ని కొనితెచ్చి పెడుతుంది. ఆసక్తి మనిషి ఆలోచనలకు పదును పెడుతుంది. సృజనాత్మకతను పెంపొంది స్తుంది. విజ్ఞానాన్ని ప్రోది చేస్తుంది. పట్టుదల, కార్యదీక్ష, అలు పెరుగని శ్రమ స్వప్నాలను సాకారం చేస్తుందనడానికి గతానికి, వర్తమానానికి మధ్య మానవ జీవిత విధానంలో గల వ్యత్యాసమే నిదర్శనం. ఇతర జీవుల కంటే మిన్నగా, భిన్నంగా జీవించాలనే మానవ తపన ఒక తపస్సుగా మారి, అనేక పరిణామాలకు దారి తీసింది. ఈ అలుపెరుగని మహా విజ్ఞాన క్రతువు పెను సంచల నాలకు దారితీసింది. దాని ఫలితమే నేడు మనం అనుభవిస్తున్న సర్వ సుఖాలకు మూలం. మానవుల హేతుబద్ధమైన ఆలోచనలే సైన్స్ పురోగతికి కారణం. మానవ జీవితం కష్టసుఖాల సంగ మం. వెలుగు నీడల దోబూచులాటల మధ్య నిరతరం సాగే మానవ జీవన గమనంలో కొత్త నీరొచ్చి పాత నీటిని ఆవలికి గెంటేస్తుంది. కాలచక్ర పరిభ్రమణంలో ఒక తరం గతిస్తే మరో తరం పుట్టుకొస్తుంది. తరాలు గడిచినా, యుగాలు గతించినా మానవ అన్వేషణ నిరంతరం కొనసాగుతూనే ఉంటుంది. ఈ అన్వేషణ దేనికోసం? ఎవరి కోసం? అనే సంశయం కలగడం సహజం. పుట్టి, పెరిగినా బట్ట కట్టని భయంకరమైన అనాగరిక స్థితిలో, ఆటవిక జీవన విధానంలో మగ్గిపోయి, మనిషికీ, మృగానికీ తేడా తెలియని అజ్ఞానాంధకారంలో జీవించి, గతించి, మరికొన్ని తరాలకు అడవుల్లో చోటిచ్చిన ప్రాచీన మానవుడు తన తరువాతి తరాలను కూడా తమలాగే జీవించమని శాసించగ లిగాడా? తాము అనుసరించిన జీవన శైలిని రాబోయే తరాలు కూడా ఆచరించమని ఆదేశించాలా? గతించిన తరాల ఆలోచనలను ఆవలికి గెంటి, తమ ఆలోచనలతో అనాగరికం నుండి నాగరికత వైపు పయనించాడు. అడవులను వదలి, ఆధునిక భవంతుల్లోకి అడుగుపెట్టాడు. మాటలు రాని స్థాయి నుంచి భాషలు నేర్చుకుని భావాలు పలికించాడు. ఆటవిక జీవన విధానం నుండి ఆధు నిక జీవనం వరకు సాగిన మానవ జీవన ప్రస్థానంలో ఎన్నో మలుపులు, ఎన్నో కుదుపులు చోటు చేసుకున్నాయి. అక్షరాలు దిద్ది, పుస్తకాలు చేతబట్టి జ్ఞాన సముపార్జనతో బుద్ధిజీవిగా అవతరించాడు. మానవ మస్తిష్కంలో చెలరేగిన ఆలోచనాత్మక, విశ్లేషణాత్మక సంఘర్షణలు విజ్ఞానానికి దారి తీసాయి. ఏదో సాధించాలన్న తపన మానవ విజ్ఞానాన్ని మలుపు తిప్పింది.

ఎన్నో అన్వేషణలు.. ఎన్నో పరిశోధనలు మానవ జీవన గమ నాన్ని మార్చేస్తాయి. నేటి సుఖమయ జీవన విధానం మానవ మేథోమథనం ద్వారా ప్రాప్తించిన అద్భుతమైన ఫలితం. నగరాలు వెలిసాయి, ఆకాశహర్మ్యాలు పెరిగాయి. అధునాతన యంత్ర పరికరాలు, గృహోపకరణాలు మన చెంతకొచ్చాయి. ప్రచార, ప్రసార సాధనాలు, వాహనాలు ఆధునీకరణ సంతరించుకు న్నాయి. అనారోగ్యానికి, అంటువ్యాధులకు ఔషధాలు కనిపెట్టబడ్డాయి. వైద్య సదుపాయాలు పెరిగాయి. సాంకేతిక సాధనాలు వినూత్నమైన రీతిలో జన జీవితాల్లో తిష్టవేసాయి. ప్రపం చాన్ని మన ముందు సాక్షాత్కారింపచేసే మొబైల్ ఫోన్లు, ఆధునిక కంప్యూటర్లు ఇలా.. ఒకటేమిటి ఎన్నో.. మరెన్నో మనకు

అందుబాటులోకి వచ్చాయి. ఊహా ప్రపంచంలో ఉగ్రరూతలూగించిన మానవ ఆలోచనలు క్రియా రూపం సంతరించుకుని, వాస్తవాన్ని మన కళ్ల ముందు ఆవిష్కరించిన వైనం నభూతో నభవిష్యతి. ఎంతగా విజ్ఞానం పెరిగినా, ఇంకా ఏదో వెలితి మానవ మస్తిష్కాన్ని వేధించింది. మానవ విజ్ఞాన జిజ్ఞాస ఫలితమే ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం. ఈ సాంకేతిక పరిజ్ఞానం దిన దిన ప్రవ వర్ధమానమై మరో అద్భుతమైన ప్రపంచపు శిఖరాల్లో నిలబెట్టింది. సాంకేతిక ప్రపంచం 'కృత్రిమ మేధ'కు శ్రీకారం చుట్టింది. కృత్రిమ మేధ అనేక రంగాలకు విస్తరించింది. కలలో సాధ్యం కాని మానవ ఊహలకు ఇలలో రెక్కలు తొడిగింది. ఈ కృత్రిమ మేధ గురించి గతంలోనే మనం సవివరంగా తెలుసుకున్నాం. ఇప్పుడు కృత్రిమ మేధ సృష్టించిన పెను ప్రభంజనంలో వెల్లువెత్తిన పలు ఆవిష్కరణలు, కృత్రిమ మేధ ప్రభావం, దాని అన్వయంతో చోటు చేసుకుంటున్న పరిణామాల గురించి, లాభ నష్టాల గురించి విపులంగా తెలుసుకుందాం.
ఇటీవల ప్రపంచ వ్యాప్తంగా, ముఖ్యంగా భారతదేశంలో 'డీప్ ఫేక్' అనే అంశం ప్రధాన చర్చనీయాంశంగా మారింది. సామాన్య ప్రజలకు డీప్ ఫేక్ గురించి తెలియకపోవచ్చు. కానీ విద్యావంతులకు, సాఫ్ట్‌వేర్ రంగానికి చెందిన ఉద్యోగులకు, సాంకేతిక మాధ్యమాల్లో మునిగి తేలుతున్న యువతకు 'డీప్ ఫేక్' గురించిన సమాచారం, వైరల్‌గా మారిన తత్సంబంధిత వీడియోల గురించి, కృత్రిమ మేధ(ఎఐ) వలన ఏర్పడుతున్న పరిణామాల గురించి, డీప్ ఫేక్ టెక్నాలజీ వలన మహిళల భద్రతకు ఏర్పడుతున్న ముప్పు గురించి ప్రత్యేకించి చెప్పనవసరం లేదు. అయితే సాంకేతిక పరిజ్ఞానం గురించి ఏమాత్రం తెలియని ప్రజలకు, సామాజిక మాధ్యమాల వెంటబడుతున్న యువతకు పాఠశాల విద్యార్థులకు, ముఖ్యంగా బాలికలకు 'డీప్ ఫేక్' గురించిన కనీస ప్రాథమిక జ్ఞానం అందించాలి. భవిష్యత్తులో దీనివలన ఏర్పడే పరిణామాలపై అవగాహన కలిగించి, అప్రమత్తంగా మెలగవలసిన అవసరాన్ని తెలియజెప్పాలి. సాంకేతిక ప్రపంచంలో, సోషల్ మీడియా వేదికల్ల భయంకరమైన అలజడి సృష్టించిన డీప్ ఫేక్ టెక్నాలజీ గురించి సవివరంగా చర్చించాలి. డీప్ లెర్నింగ్ టెక్నాలజీతో కల్పితమైన అశ్లీలమైన దృశ్యాలను సృష్టించి, వ్యాప్తి చేసే ఒక హానికరమైన సృజనాత్మక కళ డీప్ ఫేక్‌ను అభివర్ణించవచ్చు.



డీప్ లెర్నింగ్ అనేది ఒక తరహా మెషీన్ లెర్నింగ్. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డీప్ లెర్నింగ్‌ల కలయికతో 'డీప్ ఫేక్' ఆవిర్భావం జరిగింది. 1990వ దశకంలోనే దీనికి అంకురార్పణ జరిగినట్లు కొంత సమాచారముంది. 'డీప్', 'ఫేక్' అనే రెండు వేర్వేరు పదాల అర్థాలను, శబ్దాలను కలపడం వలన 'డీప్ ఫేక్' ఏర్పడింది. 'డీప్ ఫేక్' అనేది ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఎఐ) ఆధారిత అభూత కల్పనల కృత్రిమ సాంకేతిక మాధ్యమం. దీనినే 'సింథటిక్ మీడియా' అంటారు. ఇదొక కల్పిత దృశ్యాలతో కూడిన కథనాలకు వేదిక. 'డీప్ ఫేక్'ను కృత్రిమ మేధస్సు (ఎఐ)కు మానస పుత్రికగా అభివర్ణించడంలో అతిశయోక్తి లేదు. గూగుల్, ఫేస్ బుక్, మైక్రో సాఫ్ట్ వంటి దిగ్గజాలు కృత్రిమ మేధస్సు పరిశోధనల్లో, వినియోగంలో ముందంజలో ఉన్నాయి. అమెరికా కృత్రిమ మేధస్సు అభివృద్ధిలో అగ్ర స్థానంలో ఉంది. చాట్ జిపిటి అనే సరికొత్త సాంకేతిక ప్రక్రియ ఓపెన్ ఏ.ఐ.ద్వారా గత సంవత్సరం ప్రారంభించబడింది. ఇది కృత్రిమ మేధస్సుతో పని చేసే వినూత్న సాంకేతిక ప్రక్రియ. మనిషిని పోలిన ప్రతిస్పందన, సంభాషణ దీని ప్రత్యేకతలు. పలు విషయాల్లో సహకారానికి, వివరణలకు, విశ్లేషణ లకు, కోడింగ్‌కు చాట్ జిపిటి ఉపకరిస్తుంది. మానవ శక్తిని, యుక్తిని, అపరిమితమైన మేధస్సును సాంకేతిక వ్యవస్థలకు అన్వయించి, వాటి ద్వారా అలవోకగా పనులను చక్కబెట్టే మార్గం 'కృత్రిమ మేధ'. మానవ జీవితాలను మరో ప్రపంచం వైపు తీసుకుపోయే వినూత్న సాంకేతిక విప్లవానికి నాందిగా 'ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్'ను పేర్కొనవచ్చు. మానవ శక్తి కంటే యాంత్రిక శక్తిని, కృత్రిమ మేధస్సును ఉపయోగించడం వలన సత్వర ఫలితాలు స్వల్ప వ్యవధిలో సిద్ధిస్తాయి. చంద్రయాన్-3 దక్షిణ ధృవంపై దిగిన సందర్భంలో విక్రమ్ ల్యాండర్‌ని నియంత్రించడంలో ఎఐ టెక్నాలజీ వినియోగించారు.
ఎఐ ప్రక్రియను రోబోల తయారీలోను, వాహనాలను నడపడానికి, సామాజిక మాధ్యమాల్లోను వినియోగిస్తున్నారు. డీప్ ఫేక్ రెండు దశాబ్దాల క్రితమే ప్రారంభమై ప్రస్తుతం విస్తృత పరిధిని ఏర్పరచుకుంది. సింథసిస్ టెక్నిక్‌లతో అశ్లీలమైన వీడియోలను సృష్టించి, సామాజిక మాధ్యమాల్లో ప్రదర్శించడం, ఫేస్‌బుక్, ఇన్‌స్టా వంటి సోషల్ మీడియా అకౌంట్లను హ్యాక్ చేయడం, వాట్సాప్ ద్వారా కాల్స్ చేసి, మన వాయిస్‌లను రికార్డు చేసి, ఆర్థిక పరమైన మోసాలకు వినియోగించుకోవడం జరుగుతున్నది. ఈ ప్రక్రియలో లైంగికపరమైన దృశ్యాలను ఎఐ ద్వారా సృష్టించి స్త్రీల జీవితాలను మట్టుబెట్టడం, పరుల పరువు ప్రతిష్టలకు భంగం కలిగించే విధంగా దారుణమైన దుష్కృత్యాలకు పాల్పడుతున్నారు. డీప్‌ఫేక్‌తో అసభ్య వీడియోలను తయారు చేసి, పోర్న్‌సైట్‌లో అప్‌లోడ్ చేస్తున్నారు. ఇలాంటి చర్యల వలన కుటుంబాలు కూలిపోయే ప్రమాదం పొంచి ఉంది. ఫేక్ కంటెంట్ సృష్టించి బెదిరించి డబ్బులు వసూలు చేయడం, లొంగకపోతే పోర్న్ సైట్‌లో పోస్ట్ చేయడం వంటి మార్గాలను డీప్ ఫేక్ మాయగాళ్లు ఎన్నుకోవడం జుగుప్సాకరం, అభ్యంతరకరం.
బాలికల కృత్రిమ లైంగిక వీడియోలను సృష్టించి, బాహ్య ప్రపంచంలోకి వదిలేయడం, అభ్యంతకరమైన కృత్రిమ ఉపన్యాసాలను, నకిలీ వార్తలను వండి, వార్చి, వడ్డించడం 'డీప్ ఫేక్' మోసాలకు సంబంధించిన దారుణ అసాంఘిక ఉన్మాదానికి పరాకాష్ఠ. పూర్వ కాలంలో మానవ జీవితం సజావుగా సాగడానికి కొన్ని కుటుంబ కట్టుబాట్లు, నైతిక విలువల ఆధారిత నియమ నిబంధనలు రూపొం దించి, ఆచరించేవారు. దీనివలన కుటుంబ వ్యవస్థలతో పాటు సమాజంలో కూడా ప్రశాంతమైన వాతావరణం, సుహృద్భావం నెలకొని ఉండేది. అయితే అప్పట్లో కూడా స్వల్ప స్థాయిలో మోసాలు, నేరాలు జరిగేవి. నేరాలు చేసిన వారికి నాటి సమాజంలో స్థానం ఉండేది కాదు. సచ్చరిత్ర గలవారికే గుర్తింపు, గౌరవం లభించేది. టెక్నాలజీ అంటే ఏమిటో తెలియని రోజుల్లోనే నకిలీ కరెన్సీ నోట్ల తయారీ, చెలామణీ జరిగాయి. నకిలీ పత్రాలతో, సంతకాలతో, నకిలీ వేలి ముద్రలతో అమాయకుల ఆస్తులు

కాజేసిన సందర్భాలు కూడా ఉన్నాయి. అప్పట్లోనే 'మానిప్యులేషన్' ప్రక్రియకు బీజం పడిన మాట వాస్తవం. ఈ ఆధునిక కాలంలో, టెక్నాలజీ పెరిగిన నేటి రోజుల్లో మోసాలు జరగడంలో ఆశ్చర్యమేముంది! అయితే మనం భయపడిన దానికంటే తీవ్రమైన సైబర్ నేరాలు నేటి సాంకేతిక వ్యవస్థలో విశృంఖలంగా జరుగుతున్న మాట యథార్థం. సామాజిక మాధ్యమాలు మనుషుల మధ్య దూరం తగ్గించినా మనుషుల మధ్య దూరం పెంచేసాయి. ఎక్కడో విదేశాల్లో కూర్చుని సాంకేతిక పరిజ్ఞానం సాయంతో మోసాలకు పాల్పడుతూ, కోట్లు కూడబెట్టి విలాసాల్లో మునిగి తేలుతున్నవారు కోకొల్లలు. 'కాదేదీ కవిత కనర్హం' అన్నట్లుగా మోసాలకు, అక్రమ ధనార్జనకు అన్ని మార్గాలను అవలంబిస్తున్నారు. అడ్డదార్లు తొక్కుతున్నారు. మొబైల్ ఫోన్ల ద్వారా ఓ.టి.పి.లు అడగడం, లింక్‌లను పంపించి క్లిక్ చేయమనడం ద్వారా డబ్బులు కాజేయడం వంటి ఆర్థిక నేరాలు జరుగుతున్నాయి. అపరిచిత వ్యక్తులు వాట్సాప్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రాం పలకరింపులతో దగ్గరై మోసాలకు పాల్పడుతున్నారు. నేటి కాలంలో యూట్యూబ్ ద్వారా, రీల్స్ ద్వారా చదువులేనివారు సైతం లక్షల్లో డబ్బు సంపాదిస్తున్నారు. చదువుకున్న యువతకు ఉద్యోగ కల్పన కష్టసాధ్యమైన తరుణంలో సోషల్ మీడియా సంపాదనకు ఒక వేదికగా వరింది. ఇందులో తప్పు పట్టవలసిన అవసరం లేదు. అయితే జుగుప్సాకరమైన కంటెంట్‌ను కొంతమంది యూట్యూబర్లు సామాజిక మాధ్యమాల్లో చొప్పిస్తూ, సవజానికి తీవ్రమైన అన్యాయం చేస్తున్నారు. మొబైల్ ఫోన్లు బాలలకు కూడా అందుబాటులోకి వచ్చిన తరుణంలో సోషల్ మీడియా వారిపై విస్తృత ప్రభావం చూపెడుతున్నది. యువత విషయం ప్రత్యేకంగా చెప్పనక్కరలేదు. ఇప్పటికే ఫొటో ఎడిటింగ్ ద్వారా యువతులను తప్పుగా చిత్రీకరించి, సామాజిక మాధ్యమాల ద్వారా వారిని అనేక రకాల హింసలకు గురి చేస్తున్న సంఘటనలు జరుగుతున్నాయి. ఇలాంటి వాటి బారిన పడి, కొంతమంది యువతులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. ఇటువంటి తరుణంలో 'ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్' జన జీవితాల్లోకి ప్రవేశించింది. కృత్రిమ మేధస్సు సాంకేతిక రంగాన్ని ఆవహించింది. ఇదే సందర్భంలో అత్యంత ప్రమాదకరమైన పరిస్థితులకు కూడా ఎ.ఐ. కారణభూతమవుతున్నది. ఏఐ ఆధారంగా చాట్ జీపీటి, చాట్ బాట్, చాట్ బేస్, బ్రౌస్ ఎ.ఐ., రీడ్ ఎ.ఐ. తదితర యాప్స్ పని చేస్తున్నాయి. కృత్రిమ మేధస్సుతో పని చేసే అత్యంత భయంకరమైన 'డీప్‌ఫేక్' టెక్నాలజీ ప్రస్తుత సాంకేతిక ప్రపంచంలో 'యాడింగ్ ఫ్యూయల్ టు ఫైర్' అన్నట్లుగా కార్చిచ్చు సృష్టిస్తున్నది. చిన్న పిల్లలు, యువత డీప్ ఫేక్ వలలో చిక్కుకుంటే చాలా అనర్థాలు జరుగుతాయి. అనైతికకు అడ్డాగా మారిన 'డీప్ ఫేక్' యువతుల పాలిట శాపంగా మారుతున్నది.

ఒరిజినల్ కంటెంట్ స్థానంలో నకిలీ కంటెంట్‌ను పొందుపరచి, అదే నిజంగా నమ్మించడంలో డీప్ ఫేక్ ప్రధాన పాత్ర వహిస్తున్నది. ఇప్పటివరకు ఒకరి ఫొటో స్థానంలో మరొకరి ఫొటో జోడించడం, ఒకరి ముఖం బదులుగా మరొక ముఖం తగిలించి ప్రముఖ వ్యక్తుల ప్రతిష్టను మసక బారేటట్టు చేయడం చూసాం. మార్ఫింగ్ కళలో ఆరితేరి, అనైతికంగా వ్యవహరిస్తున్నవారిని గుర్తించడంలో సైబర్ క్రైమ్ అధికారులు తోడ్పాటునందిస్తున్నారు. 'కృత్రిమ మేధ' సాయంతో నడుస్తున్న డీప్‌ఫేక్ వీడియోలు ప్రపంచంలోని పలువురు నాయకులను, చలనచిత్ర రంగానికి చెందిన సెలబ్రిటీలను అపఖ్యాతి చేయడం నడుస్తున్న సాంకేతిక




చరిత్రలో చోటు చేసుకుంటున్న అత్యంత ప్రమాదకరమైన అనైతికమైన వ్యక్తిత్వ హనన చర్య. సెలబ్రిటీల అసలు వీడియోలను పోర్న్ వీడియోలుగా మార్చి వారిని మానసికంగా వేధిస్తున్నారు. సమాజంలో పలుకుబడి గల వ్యక్తుల పరిస్థితే ఇలా ఉంటే ఇక సామాన్య యువత ఇలాంటి అనైతిక, అరాచక ఆధునిక కీచక వ్యవస్థపై ఎలా పోరాడగలదు? డీప్ ఫేక్ సృష్టిస్తున్న దృశ్య, శబ్ద, అభూత కల్పనల మాయా ప్రపంచంలో భవిష్యత్తులో ఆడపిల్లల గతి ఏమిటి? ఫొటో మ్యానిప్యులేషన్ నుండి డీప్‌ఫేక్ వీడియోల వరకు సాగిన సాంకేతిక మార్పుల క్రమంలో జరుగుతున్న ఘోరమైన అనైతిక విన్యాసాలు సమాజాన్ని అధోగతిపాలు చేస్తున్నాయి. ముఖ్యంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అభివృద్ధి చెంది, వివిధ సాంకేతిక సాధనాలు విస్తరించిన తర్వాత ప్రపంచ గమనం వేగవంతమైనది. అనేక మార్పులు సంతరించుకుంటున్నాయి.

**భవిష్యత్తు పరిణామాలు ఎలావుంటాయో?**

ఇదే సందర్భంలో మహిళల పట్ల, బాలికల పట్ల, చదువుకుంటున్న యువత పట్ల డీప్‌ఫేక్ ప్రభావం ముంముందు ఎలాంటి పరిణామాలకు దారి తీస్తుందో ఊహింపశక్యం కాదు. వర్తమానంలో జరుగుతున్న సంఘటనలు ఈ భయాన్ని మరింతగా పెంచుతున్నాయి. సాంకేతిక రంగం రోజు రోజుకీ కొంగొత్త రూపం సంతరించుకుంటున్నది. ఎన్నో కొత్త కొత్త టెక్నిక్‌లు సాంకేతికతను కొత్త పుంతలు తొక్కిస్తున్నాయి. ప్రతీ సాంకేతిక ప్రక్రియ పనిలో నైపుణ్యాన్ని పెంచడానికి, పని చేసే పద్ధతిలో సౌలభ్యతను చేకూర్చడానికి, ఉపాధి అవకాశాలు పెంచడానికి ఉద్దేశించినవే. అయితే 'అనుకున్నదొకటి, అయ్యిందొకటి' అన్న చందంగా సద్వినియోగపడవలసిన టెక్నాలజీ దుర్వినియోగంలో ముందుకు దూసుకుపోవడం అవాంఛనీయ పరిణామాలకు ఆజ్యం పోసినట్టుగా తయారైనది. డీప్ ఫేక్ టెక్నాలజీ కొండ నాలుకకు మందు వేస్తే ఉన్న నాలుక ఊడిన చందంగా మారింది. సృజనాత్మకతను పెంచడం ద్వారా ఎంటర్‌టైన్‌మెంట్, గేమింగ్ వంటి రంగాలు డీప్ ఫేక్ సాంకేతికతతో కొత్త అందాలను సంతరించుకుంటాయి. సినీ నటుల డబ్బింగ్ కోసం, విద్యాబోధనలో ఉపాధ్యాయులకు సహకరించడం కోసం, సరికొత్త సంగీత స్వరాల రూపకల్పనలోను ఎ.ఐ. ఆధారిత అధునాతన పరిజ్ఞానం ఎంతో ఉపయోగపడగలదు. భవిష్యత్తులో చలన చిత్రాలు కూడా చనిపోయిన వ్యక్తులను ఉపయోగించి, వారి అసలు గొంతును అనుకరించి, అన్వయించి, కత్రిమ గొంతుతో గతించిన నటులను కృత్రిమంగా తెరపై పునరు జ్జీవింపచేసే అవకాశం ఉంది. అయితే ఇలాంటి ప్రయోజనాలకు వినియోగపడవలసిన 'డీప్ ఫేక్' టెక్నాలజీ అశ్లీలమైన ఫేక్ దృశ్యాల విష వలయానికి వేదిక కావడం దురదృష్టకరం.

డీప్ ఫేక్ వ్యవహారంపై కేంద్ర ఐ.టి.శాఖ కీలక నిర్ణయాలు తీసుకుంటున్నది. ఇటీవల భారతదేశానికి చెందిన కొంతమంది

సెలబ్రిటీలు డీప్ ఫేక్ వీడియోల వలన మనోవ్యథ అనుభవించిన విషయం విదితమే. సాక్షాత్తు ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ సైతం డీప్ ఫేక్ బాధితుడు కావడం విశేషం. ఏఐ ఆధారంగా ప్రధాన మంత్రి కొంత మంది మహిళలతో కలిసి డ్యాన్స్ చేస్తున్న దృశ్యం వైరల్‌గా మారింది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సహాయంలో ఈ డీప్ ఫేక్ వీడియో తయారు చేయబడింది. కత్రినాకైఫ్, కాజోల్, రష్మికా మందన్న వంటి తారల డీప్ ఫేక్ వీడియోలు సామాజిక మాధ్యమాల్లో ప్రవేశించి, వారిని మానసిక క్షోభకు గురి చేసిన విషయం విదితమే. డీప్ ఫేక్ వీడియోలపై ప్రధానమంత్రి సైతం ఆందోళన వ్యక్తం చేస్తూ, భారతీయ సమాజానికి ఇటువంటి టెక్నాలజీ కీడు చేస్తుందని తెలిపారు. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు తారాస్థాయికి చేరుకునే అవకాశముంది. ఫేస్‌బుక్ వ్యవస్థాపకుడు మార్క్ జుకర్‌బర్గ్ డీప్ ఫేక్ బాధితుడే. ప్రస్తుత అమెరికా అధ్యక్షుడు జో బైడెన్, మాజీ అధ్యక్షులు బరాక్ ఒబామా, డోనాల్డ్ ట్రంప్‌లు కూడా డీప్ ఫేక్ బాధితులు కావడం విశేషం. గత సంవత్సరం ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్ స్కీ తన సైనిక దళాల గురించి, వారిని లొంగిపొమ్మన్నట్టుగా డీప్ ఫేక్ వీడియో విడుదలై గందరగోళపరిచింది. ఒకరి ముఖానికి మరొకరి ముఖం అతికించి, వారి గొంతుతో వీడియోలను సృష్టిస్తూ వివాదాస్పదమవుతున్న డీప్ ఫేక్ టెక్నాలజీ పట్ల జాగరూకత వహించాలి. ప్రపంచ వ్యాప్తంగా 15 వేల డీప్ ఫేక్ వీడియోలను గర్తించారు. ఇందులో 96 శాతం పోర్నో గ్రాఫిక్ వీడియోలు ప్రముఖ మహిళా సెలబ్రిటీల ముఖాలను వేరే స్త్రీల ముఖాలకు అతికించి పోర్న్ వీడియోలుగా మార్చినట్టు తెలుస్తున్నది. అడల్ట్ కంటెంట్‌తో కూడిన డీప్ ఫేక్ వీడియోల వ్యవహారంలో దక్షిణ కొరియా ప్రపంచంలో 53 శాతంతో మొదటి స్థానం ఆక్రమించింది. అమెరికా 20 శాతంతో రెండవ స్థానం, జపాన్ 10 శాతంతో మూడవ స్థానం ఆక్రమించగా ఇండియా 2 శాతంతో 6వ స్థానంలో ఉంది. ప్రపంచంలో డీప్ ఫేక్ వీడియోలను వీక్షించేవారి సంఖ్య కూడా అధికంగానే ఉన్నట్టు అంచనా. డీప్ ఫేక్ వీడియోల కోసం సుమారు 100 వెబ్‌సైట్లు, 80కి పైగా ఆన్‌లైన్ ఛానల్స్ పని చేస్తున్నాయని ఒక అంచనా. చాట్ జిపిటి ప్రపంచంలో ఏఐ పరికరాల తయారీలో ప్రముఖ పాత్ర వహిస్తున్నది. ఓపెన్ ఎ.ఐ. ఇటీవల వెలువడ్డ డీప్ ఫేక్ వీడియోల వలన వెలుగులోకి వచ్చింది. సాక్ష్యాల తారుమారులోను, ఇతరులను బ్లాక్‌మెయిల్ చేయడం, హింస, వేధింపుల వంటి విషయాల్లోను, తప్పుడు సమాచారం వ్యాపింపచేయడంలోను, ప్రతీకార చర్యల్లోను డీప్ ఫేక్ ప్రధాన పాత్ర వహిస్తున్నది. డీప్ ఫేక్‌ను కొన్ని విషయాల్లో చట్టాలు అంగీకరించవు. బాలలను అశ్లీలంగా చూపించడం (చైల్డ్ పోర్నోగ్రఫీ), మహిళలను తప్పుడు పద్ధతుల్లో కృత్రిమంగా చిత్రీకరించడం నేరంగా పరిగణిస్తారు. మన దేశంలో కేరళ రాష్ట్రంలో మొట్టమొదటి డీప్ ఫేక్ వీడియో కనుగొన్నారు. డీప్ ఫేక్‌ల



విషయంలో ప్రపంచ స్థాయిలో సరైన చట్టాలు లేకపోవడం వలన బాధితులకు న్యాయం జరగడం లేదనే సంకేతాలు వెలువడుతున్నాయి. బ్యాంకు ఖాతా వివరాలు తెలుసుకోవడానికి, క్రెడిట్ కార్డు వివరాలను తెలుసుకోవడానికి డీప్ ఫేక్ టెక్నాలజీ ద్వారా నకిలీ గొంతుతో బ్యాంకు అధికారులు మాట్లాడుతున్నట్టుగా భ్రమ కలిగించడానికి ఈ టెక్నాలజీ ఉపయోగించవచ్చనే సమాచారముంది.

### చట్టాలు కఠినంగా ఉండాలి

డీప్ ఫేక్ విషయంలో అంతా అప్రమత్తంగానే ఉండాలి. టెక్నాలజీ దుర్వినియోగం చేస్తే కఠిన చర్యలు తీసుకునే అవకాశం భారతీయ ఇన్ఫర్మేషన్ అండ్ టెక్నాలజీ చట్టాలకు ఉంది. ఇటీవల కేంద్ర ఐ.టి. శాఖా మంత్రి అధ్యక్షతన జరిగిన సోషల్ మీడియా సంస్థల ప్రతినిధుల సమావేశంలో డీప్ ఫేక్ టెక్నాలజీ వలన తలెత్తుతున్న సమస్యల గురించి చర్చించడం జరిగింది. డీప్ ఫేక్ మోసపూరిత కంటెంట్‌ను సృష్టించి, వ్యాపింపచేసే వారి పట్ల కఠినంగా వ్యవహరిస్తామని, సరికొత్త ఐ.టి. చట్టాలను తీసుకొచ్చి, డీప్ ఫేక్ మోసగాళ్లను కఠినంగా శిక్షిస్తామని తెలిపారు. డీప్ ఫేక్ బాధితులు తమ సమస్యల గురించి ఫిర్యాదులు చేయవచ్చని, కేంద్రం డీప్ ఫేక్ సంబంధిత కేసుల దర్యాప్తుకు ఒక ప్రత్యేక అధికారిని నియమిస్తుందని తెలిపారు. కేంద్రం తీసుకునే నిర్ణయాలు ఎలాంటి ఫలితాలనిస్తాయో వేచి చూడాలి. సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లలో డీప్ ఫేక్ దృశ్యాలు రూపొందించుకోవాలి. కంప్యూటర్లు, మొబైల్ ఫోన్ల డేటా చౌర్యం కాకుండా చూడాలి. యాంటీ మాల్ వేర్, యాంటీ వైరస్ సాఫ్ట్‌వేర్‌ల మాదిరిగా కృత్రిమ మేధను ఉపయోగించే అన్ని సాంకేతిక వ్యవస్థలు, కంపెనీలు డీప్ ఫేక్ డిటెక్షన్ సాఫ్ట్‌వేర్‌ను ఉపయోగించాలి. డీప్ ఫేక్‌ల నుండి రక్షణకు మైక్రోసాఫ్ట్ వంటి టెకీ దిగ్గజ కంపెనీలు తగిన చర్యలు తీసుకుంటున్నాయి. ఇప్పటికే ఫేస్ బుక్, ట్విట్టర్‌లు ప్రమాదకరమైన డీప్ ఫేక్‌లను నిషేధించాయి. మన దేశంలో నకిలీ వీడియోలతో, నకిలీ కంటెంట్‌తో వేధించే వారిపై తక్షణ చర్యలు తీసుకోవడానికి చట్టాలు అనుమతిస్తున్నాయి. మార్ఫింగ్ ఫొటోలు, ఎ.ఐ. ద్వారా విడుదల చేసిన వీడియోలు నకిలీగా తేలితే 36 గంట్లోగా వాటిని తొలగిస్తారు. ఆధునిక టెక్నాలజీతో మోసం చేసి సైబర్ నేరగాళ్లకు లక్ష జరిమానా, మూడేళ్ల వరకు జైలుశిక్ష వంటి కఠిన చర్యలున్నాయి. అయితే నేరస్తులు ప్రపంచంలో ఏదో మూలన దాగుని ఇటువంటి అశ్లీల దృశ్యాలను, నకిలీ కంటెంట్‌ను తయారు చేయడం వలన నేరస్థులను శిక్షించడం సాధ్యమా? కరడు గట్టిన నేరస్తులను ఎక్కడున్నా పట్టుకోవడానికి ఇంటర్‌పోల్ సహాయాన్ని వివిధ దేశాల ప్రభుత్వాలు ఎలా సహకారం కోరతాయో, అలాగే డీప్ ఫేక్ సైబర్ నేరస్థులను సత్వరమే పట్టకుని, శిక్షించడానికి అన్ని దేశాల ఐ.టి. శాఖలు పటిష్టమైన సమిష్టి యంత్రాంగాన్ని రూపొందించుకుని ఒక దేశానికి మరొక దేశం సహకరించు కోవాలి. చైనా ఇప్పటికే డీప్ ఫేక్‌ల విషయంలో తగిన మార్గదర్శకాలు రూపొందించింది. అమెరికా కూడా డీప్ ఫేక్ వలన ఉత్పన్న మయ్యే పరిస్థితుల నుండి కాపాడుకోవడానికి డీప్ ఫేక్ టాస్క్‌ఫోర్స్ చట్టాన్ని ప్రవేశపెట్టడం జరిగింది. ప్రపంచ మంతా ఏకమై డీప్ ఫేక్‌పై తగిన కార్యాచరణ ప్రకటించి, ఈ విషయంలో మరింత పకడ్బందీ

చట్టాలను ప్రవేశపెట్టాలి. ఇకనైనా ప్రపంచ దేశాలు కృత్రిమ మేధ వలన ఉత్పన్నమయ్యే సమస్యల పట్ల అప్రమత్తత పాటించాలి. ఏ.ఐ. ఆధిరత సామాజిక మాధ్యమాలు అనైతికమైన కార్యకలాపాలకు, ఆర్థిక మోసాలకు దారి తీయకుండా, వ్యక్తిత్వ హననానికి పాల్పడకుండా ఏఐ ప్రతినిధులు, ఏఐ ఆధారిత యాప్స్ రూపకర్తలు తగిన నియమ నిబంధనలు పాటించాలి.

చదువు సంస్కారాన్ని పెంపొందించాలి. జ్ఞానం వివేకాన్ని ప్రోది చేయాలి. కానీ నడుస్తున్న చరిత్ర తద్భిన్నంగా ఉంది. ప్రస్తుత సమాజంలో నిరక్షరాస్యుల సంఖ్య తగ్గుతున్నది. అక్షరాస్యత పెరుగుతున్నది. విద్యావంతుల శాతం గణనీయంగా పెరుగుతున్నా నేరాల సంఖ్య మాత్రం తగ్గడం లేదు. మారుతున్న సమాజంలో మనుషుల ప్రవర్తనలో మార్పు రావడం లేదు. నైతిక విలువలు విధ్వంసమైపోతున్నాయి. దీనికి గల కారణాలను అన్వేషించాలి. సాంకేతిక పరిజ్ఞానమే నిజమైన విద్యగా ఈ డిజిటల్ ప్రపంచంలో పరిగణించబడుతున్న సూచనలు కనిపిస్తున్నాయి. ప్రస్తుత ఆధునిక యుగంలో నూతనంగా వస్తున్న టెక్నాలజీ మెళకువలను తెలుసుకుని, మొబైల్, కంప్యూటర్ కీబోర్డుతో అనుక్షణం కాలం గడపడమే జీవిత లక్ష్యంగా మారిపోయింది. మొబైల్ ఫోన్ల మాయాజాలంలో జనం తలమునకలై పరవశించిపోతున్నారు. మంచి-చెడుల విచక్షణ నేటి యువత పట్టించుకోవడం లేదు. కేవలం డబ్బు సంపాదించడానికే చదువులన్న ధోరణి ప్రబలిపోయింది. నీతిని బోధించే చదువులు అంతరించిపోయాయి. టెక్నాలజీ పెరిగినా, దానిని సక్రమ పంథాలో వినియోగించాలన్న జ్ఞానం లోపించడం వలన, మోసంతోనైనా కోట్లు కూడబెట్టాలనే దురాశ ప్రబలడం వలన అత్యున్నత సాంకేతిక పరిజ్ఞానం సైబర్ నేరాలకు దారి తీస్తున్నది. ఆర్థిక పరమైన మోసాలకు పాల్పడడం, స్త్రీలను హింసించడం, బ్లాక్ మెయిలింగ్‌కు పాల్పడడం వంటి చర్యల ద్వారా సాంకేతికత అనైతికతకు దారి తీస్తున్నది. కృత్రిమ మేధ 'డీప్ ఫేక్' వంటి అనాగరిక కార్యక్రమాలకు అవకాశంగా మారింది. నూతన టెక్నాలజీ సక్రమమైన పద్ధతిలో ఉపాధికి మార్గం చూపాలే తప్ప, అడ్డదారుల్లో పయనించడానికి, ఆర్థిక మోసాలకు, వేధింపులకు నెలవు కాకూడదు. సాంకేతిక జ్ఞానం వలన పలు రంగాలు అభివృద్ధి చెందిన మాట వాస్తవం. ప్రపంచ వ్యాప్తంగా కోట్లాది మంది యువతీ యువకులకు జీవనోపాధి కల్పిస్తున్న విషయం కూడా కాదనలేని సత్యం. అయితే ఇదే సందర్భంలో టెక్నాలజీని దుర్వినియోగం చేయడం వలన పలు అనర్థాలు జరుగుతున్నాయని చెప్పడం సత్యదూరం కాదు. అనైతికమైన పద్ధతుల్లో వినియోగించే సాంకేతికత వలన జరిగే వికృత పైశాచిక విలయ హోమంలో ఎంతో మంది అమాయకులు, మహిళలు సమిధలుగా మారుతున్నారు.




సామాన్యులతో పాటు విద్యావంతులు సైతం ఈ వికృత క్రీడా విన్యాసాలలో వంచింపబడుతున్నారు. సామాజిక మాధ్యమాలు చిందిస్తున్న విషాన్ని అణువణువునా నింపుకుని, భవితను బలిపీఠమెక్కించి, యువశక్తిని కాలరాస్తున్న సంస్కృతి ప్రబలమై, అష్టవంకరల దారుల్లో అధోగతి పాలై అవలక్షణాలతో అఘోరిస్తున్న వర్తమానం భవిష్య పునాదులను పెకలించి, దిక్కులేని తీరాల వైపు పరుగులు పెట్టిస్తున్న నేపథ్యంలో మానవ జీవితాలపై కారుచీకట్లు అలుముకుంటున్నాయి. విద్యలను సేద్యం చేసి, డిగ్రీల దర్పంలో సాంకేతిక సాయంతో వర్తమాన ప్రపంచాన్ని మార్చేసే సామర్థ్యం గల యువత రేపటి ప్రపంచాన్ని చీకటి లోకపు అంచులకు తీసుకుపోతుంటే, కన్నీటి ధారలు కాలువలై ప్రవహించి ఎడారి ఇసుకతిన్నెల్లో ఇంకిపోతున్నాయి. అడ్డదిడ్డమైన రూపాల్లో విశృంఖల విహారం చేస్తున్న సామాజిక మాధ్యమాలు విలువైన భవిష్యత్తును నాశనం చేస్తుంటే, యువశక్తి ఆకులు రాలిన చెట్టులా, నేలకూలిన వట వృక్షంలా మారుతుంటే, శిశిరంలో మోడుబారిన చెట్లకొమ్మలు చిగురుటాకుల స్నేహం కోసం వసంతాన్ని మెల్కొలిపినట్టు, సమాజ శ్రేయస్సును ఆశించేవారు విద్యార్థులను, యువతను అనైతిక సాంకేతిక విష వలయంలో చిక్కుకోవద్దని హెచ్చరిస్తున్నారు.

ప్రపంచ వ్యాప్తంగా 'డీప్ ఫేక్' సృష్టిస్తున్న అలజడుల పట్ల టెక్ కంపెనీలు, టెక్నాలజీ నిపుణులు, సామాజిక మాధ్యమాల యాజమాన్యం కృత్రిమ మేధ పక్కదార్లు పట్టకుండా కట్టుదిట్టమైన యంత్రాంగాన్ని రూపొందించడానికి ప్రయత్నించాలి. అంతర్జాతీయ సమాజం కృత్రిమ మేధ వలన తలెత్తుతున్న డీప్ ఫేక్ వ్యవస్థలను సామాజిక మాధ్యమాల నుండి పూర్తిగా నిషేధించాలి. టెక్ దిగ్గజాలన్నీ ఇందుకోసం చొరవ తీసుకోవాలి. ఈలోగా డీప్ ఫేక్‌పై విద్యార్థు లకు, యువతకు అవగాహన కలిగించాలి. డీప్ ఫేక్ వీడియోల వలన జనజీవన స్రవంతి ఎలాంటి ఒడుదుడుకులకు లోను కారాదు. ముఖ్యంగా స్త్రీల గౌరవానికి ఎలాంటి భంగం వాటిల్లకూడదు. ఆర్థిక నేరాలకు 'ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్' అడ్డా కాకూడదు. ఒరిజినల్ వీడియోలకు డీప్ ఫేక్ వీడియో లకు మధ్య వ్యత్యాసాన్ని గుర్తించే స్పష్ట మైన సంకేతాలుండాలి. సర్వసాధారణంగా డీప్ ఫేక్ వీడియోలు స్పష్టంగా ఉండవు. ఇందులోని దృశ్యాల్లో గుర్తించదగ్గ తేడా కనబడుతుంది. దీనిని గమనించాలి. ఇలాంటి వీడియోలలోని వ్యక్తుల గొంతుకు, వారి ముఖకవళికలకు పొంతన కుదరదు. అసహజమైన కదలికలతో, అసందర్భమైన శబ్దంతో కూడిన వీడియోలను 'డీప్ ఫేక్' వీడియోలుగా గుర్తించాలి. అసాంఘిక దృశ్యాలను సాంఘిక మాధ్యమాల ద్వారా జన బాహుళ్యంలోకి విడుదల చేసి, అడ్డ దారిలో ఆర్థిక ప్రయోజనాలు పొందాలని చూస్తున్న అరాచక, అసాంఘిక సైబర్ నేరస్థుల వికృత మనస్తత్వాలు ఆటవిక, అనాగరిక జంతు ప్రవృత్తికి పరాకాష్ట. ఇలాంటి అక్రమ డీప్ ఫేక్ ముఠాను అరికట్టాలి. నాగరికతను నిలువునా ముంచుతున్న సాంకేతికతను చట్టాల సాయంతో నిలువరించాలి. ఆధునికతకు అర్థవంతమైన నిర్వచనం ఇవ్వాలి. ❑

# ఔషధాల సీతాఫలం

కొండల్లో కోనల్లో డొంకల్లో ఈ చెట్లు సులభంగా పెరుగుతాయి కాబట్టి వాటిని కోసుకొచ్చి అమ్మడంతో చౌకగా దొరికేవి ఒకప్పుడు. క్రమేణా దేశవిదేశీ రకాలను సంకరీకరించి సృష్టించిన హైబ్రిడ్ వెరైటీల్ని తోటల్లో ప్రత్యేకంగా పెంచుతున్నారు. దాంతో పేదోడి ఆపిల్‌గా పిలిచే సీతాఫలం ధర కాస్తా కొండెక్కి కూర్చుంది. కిలో వంద నుంచి ఐదువందల రూపాయల వరకూ పలుకుతోంది.



అయినప్పటికీ సీజన్‌లో మాత్రమే దొరికే ఆ మధురఫలాల్ని తినకుండా ఉండలేరు వరి. రుచి సంతలా ఉంచితే, సీతాఫలంలో ఔషధగుణాలూ ఎక్కువే. అందుకే ఇరవైయ్యొకటో శతాబ్దపు సూపర్ ఫ్రూట్‌గానూ పేరొందింది. విత్తనాన్నీ పరే నేలనూ బట్టి సీతాఫలం రుచి మారుతుంటుంది. వాషింగ్టన్, బ్రిటిష్ గయానా, లేట్‌గోల్డ్..వంటి విదేశీ రకాలతోపాటు షహరాన్‌పుర్, కాకర్లపహాడ్ వంటి మేలుజాతి వంగడాలనూ పండిస్తున్నారు. ఇటీవల వృద్ధి చేసిన ఆర్కసహాన్, ఆర్క నీలాంచల్ విక్రమ్‌ఎన్‌ఎమ్‌కె-101 గోల్డెన్ రకాలు అధిక గుజ్జును కలిగి ఉండి, చాలా రోజులు నిల వ ఉంటున్నాయి. దిగుబడి కూడా బాగుండటంతో వీటిని మధ్య ఎక్కువగా సాగుచేస్తున్నారు. సీతాఫలంతో పోలిస్తే మిగిలిన వాటిల్లో ఔషధ గుణాలు ఎక్కువ అయినప్పటికీ తియ్యని సీతాఫలం అంటేనే మనకిష్టం. కాకపోతే న్యూట్రాసూటికల్స్‌లో రామ, లక్ష్మణ ఫలాల్ని వాడటంతో వాటినీ ఎక్కువగా పండిస్తున్నారు. సీతాఫలాన్ని ఆ పండ్లతో సంకరీకరించి కొత్త జాతుల్నీ పుట్టిస్తున్నారు. రామాఫలం నరాల సమస్యలున్నవాళ్లకి మంచిదట. లక్ష్మణఫలంలో అల్సర్లూ రక్త సమస్యలూ బీపీ కేన్సర్లను నిరోధించే గుణాలు ఎక్కువట. పొట్టలోని నులిపురుగులకీ ఈ పండు మంచిమందు. దీని ఆకుల్ని కేన్సర్‌కు మందుగా విక్రయిస్తున్నారు. అందుకే అమెజాన్ ప్రజలు దీన్ని మిరకిల్ ట్రీ అంటారు. వయసుతో పాటు వచ్చే వ్యాధులూ దీర్ఘకాలిక వ్యాధుల్ని హనుమాన్ ఫలం నివారిస్తుందట.



ఔషధ గుణాల్ని తియ్యని సీతాఫలాన్ని మధుమేహులు తినకూడదు అనుకుంటారు. కానీ దీని గ్లైసెమిక్ ఇండెక్స్ 54 మాత్రమే. ఇందులోని పీచుగ్లూకోజ్‌ను రక్తంలో నెమ్మదిగా కలిసేలా చేస్తుంది. కాబట్టి డయాబెటిస్ వాళ్లు మితంగా తినొచ్చనీ, ఇది ఇన్‌ఫ్లమేషన్ తగ్గించి, గుండెకి మేలు చేస్తుందనీ నిపుణులు చెబుతున్నారు. ఇందులో యాంటీ ఆక్సిడెంట్లు, పీచు, ఐరన్, పొటాషియం, మెగ్నీషియం, విటమిన్‌ఎ, సిలు సమృద్ధిగా ఉంటాయి. ఈ పండులోని పీచు మలబద్ధకాన్నీ ఇతరత్రా జీర్ణసమస్యల్నీ దూరం చేస్తుంది. నియాసిన్ చెడు కొలెస్ట్రాల్‌నీ తగ్గిస్తుంది. పీసీఓడీ ఉన్నవారిలో హార్మోన్ల అసమతౌల్యత కారణంగా మూడ్‌స్వింగ్స్ ఉంటుంటాయి. అలాగే కొవిడ్ తరువాత చాలా మందిలో మానసిక ఒత్తిడి, హృద్రోగ సమస్యలు పెరిగాయి. అలాంటివాళ్లకి సీతాఫలంలో ఎక్కువగా ఉండే బి6 విటమిన్ ఆనందాన్ని కలిగించే సెరటోనిన్, డోపమైన్ హార్మోన్లస్రావాన్ని పెంచుతుంది. ఒత్తిడికి కారణమయ్యే రసాయనాల్ని అరికట్టడం ద్వారా చలికాలంలో వచ్చే మానసిక, అనారోగ్య సమస్యల్ని నివారిస్తుంది. ఈ పండు తింటే గర్భిణులకి వికారం తగ్గుతుందనీ పుట్టబోయే పిల్లల మెదడు పనితీరు బాగుం టుందనీ చెబుతున్నారు. ఇందులోని కాపర్ నెలలు నిండకుండా ప్రసవించే ప్రమాదాన్ని తగ్గిస్తుంది. పైగా కాపర్ జుట్టు తెల్లబడకుండా చేసే థైరాక్సిన్ హార్మోన్ ఉత్పత్తికి తోడ్పడు తుంది. సీతాఫలంలోని బులటాసిన్, ఆసిమిసిన్ అనే ఫ్లేవనాయిడ్లకు కేన్సర్ నిరోధక లక్షణాలు ఉన్నాయనీ, ఆల్కలాయిడ్లూ ఎసిటోజెనిన్‌లు మూత్రపిండ వ్యాధుల్ని తగ్గిస్తాయని పరిశోధనలూ చెబుతున్నాయి. మెగ్నీషియం, కాల్షియం పుష్కలంగా ఉండే సీతాఫలం ఎముక పుష్టినీ పెంచుతుంది. కాబట్టి ఆర్థ్రయిటిస్ వాళ్లకీ ఈ పండు మేలే. చర్మ సమస్యలకు ఇది మంచి మందు. పచ్చికాయల్ని దంచి ఉప్పువేసి పండ్లూ గడ్డలమీద పెట్టినా తగ్గుతాయి అంటారు. అందుకే ఇది ఔషధాల ఫలమని అంటారు.



**అలల్ని** లెక్కిస్తూ సందెపొద్దు
చుక్కల్ని లెక్కిస్తూ నెలపొడుపు పొద్దు
పరిమళించే పూలు పరిమళిస్తూనే వున్నాయి
రాలిన పూల గురించి ఇప్పుడు కన్నీళ్లెందుకు
జారిపోయిన జ్ఞాపకాల గురించి
ఇంకా నిరీక్షణలెందుకు
అస్తమించే కాలంలోకి
అనూహ్యమైన ప్రయాణం
అన్నీ వదిలి ఎక్కడికో
ఈ ప్రయాణం

## ఈవారం కవిత్వం



# ఎలా మొదలౌతుందో..

ఎలా మొదలౌతుందో అలా లయమౌతుంది
కనుచూపుకందని ఓ ఆనవాలై
ఆవలి గట్టుకు చేరుకొన్నాకే మరో
ప్రపంచం మొదలౌతుంది
అన్నీ వదిలి మరెక్కడికో
ఈ ప్రయాణం.

**- ఎం.రవి**

# నువ్వు నీకు కాదు



రంగవల్లులు అలంకరించిన దార్లో
కోకిలల గానసభ
చెట్ల మధ్యలో తల్లుల్ని చూసి లేగలు
పరుగెత్తుతున్న పచ్చిక బైళ్లలో
నడుస్తుంటావు
అటూ యిటూ
పైన కింద చూస్తూ
వజ్రాల హారం దొరుకుతుంది
అది నీది కాదు!
మాట్లాడుతుంటావు
సుభాషితం వెలువడుతుంది
ప్రజలకు అది అక్షర హారం!
చూస్తుంటావు
కారుణ్యం జనిస్తుంది
దీనులకు అది దాక్షిణ్యం!
పని చేస్తుంటావు సత్కార్యం పుడుతుంది
పీడితులకు అది అభయ హస్తం!
ఆకాశం భూమి
తమలోకి చూసుకుంటాయి
ఆకాశం భూమికోసం
భూమి ప్రజల కోసం
తమలో ముద్రించుకుంటాయి!
నీలోకి నువ్వు చూస్తావు
నీలో నువ్వు కనపడవు
నువ్వు నీకు కాదు
నేను నాకు కాదు!

**- అడిగోపుల వెంకటరత్నమ్**

# లోపల.. బయట


సైకిల్ ఆగగానే బెల్లు వినగానే
పాలోడని గుర్తుపట్టి
మెల్లగా చిన్నగా
మెట్లు దిగుతూ
ఆశగా ఆకలిగా డైమండ్ కళ్లతో చూస్తూ
వచ్చినవాడు పాలోసి వెళ్లిపోతే
ఆలస్యం చేయలేదు
నిమిషం ఆగలేదు
వాటా పోసేసి ఆకలి తీర్చేసి
.........
ఆ
గృహిణికి
ఇద్దరు కన్నపిల్లలు లోపల
ఇద్దరు దత్తపిల్లలు బయట

**- కోటం చంద్రశేఖర్**



## పుస్తక సమీక్ష

# 'చెఱకు గడల్లాంటి' బాలల గేయాలు



'బాలల మండీబాలలము/ బంతితోటలో పూవులము/ బొమ్మల్లాగా వుంటాము/ అందరినీ ఊరిస్తాము' అంటు తన 'చెఱకుగడలు' బాలల గేయ సంపుటిలోకి ఆహ్వానిస్తున్నారు కవి 'సినారె'. సరళమైన భాషలో, బాల బాలికలకు సులభంగా అర్థమయ్యేలా 50గేయాలతో బాలల ప్రపంచంలోకి మనల్ని ప్రవేశపెడ్తారు కవి. 'దొంగతనం వద్దురబాబు/ అది మహా చెడ్డఅలవాటు' అని ఉద్బోదిస్తు, గుడిలో దేవుడు వుంటాడు/ బడిలో పంతులు వుంటాడు/ బడిలో పాఠాల్ చెబుతారు/ బడికెళితే చదువొస్తుంది/ గుడికీ, బడికీ మనమంతా ప్రతిరోజూ వెళదామండి' అని పిలుపునిస్తు 'పుస్తకం పుస్తకం/ మంచి దోస్తు పుస్తకం/ నీవు ఏదికోరినా/ నీ ముందుకు తెస్తుంది/ పుస్తకాని కన్న గొప్పది/ వస్తువేమి వుంటుంది' అంటు చదువు పట్ల బాలల్లో అనురక్తిని పెంపొదిస్తు గేయలల్లారు 'సినారె'. వాన, దీపావళి, సంక్రాంతి, అమ్మ, చెఱువు, టి.వి., చకినాలు, బతుకమ్మ, చెట్లు, రైతు, మాస్టారు వస్తువులుగా అల్లిన గేయాలు బాలలను ఎంతగానో అలరిస్తాయి. 'చెఱకుగడలు' గేయసంపుటి కవి వెలువరిస్తున్న నాలుగవ గ్రంధం. కవనలోకంలో అందరూ యిష్టపడే సహృదయుడు తుమ్మూరి రాంమోహన్‌రావుకి ఈ చిరుపుస్తకాన్ని అంకితమివ్వడం ముదావహం. చెఱకు గడల్లాంటి కమ్మటి గేయాలు బాలలందర్నీ ఆహ్లాదపరుస్తాయనడంలో సందేహం లేదు. **(చెఱకుగడలు, రచన: సి.సత్యనారాయణరెడ్డి, వెల: రూ 100, ప్రతులకు: 406, శ్రీసాయి అనురాగ్ న్యూటవర్, లోతుకుంట, షామీర్ పేట్‌మండల్, మేడ్చల్‌జిల్లా)**

**- రమణ వెలమకన్ని**

# 'మొగ్గల్లో తెలంగాణ బాపూజీ'

తెలంగాణ ఉద్యమ పితామహుడు ఆచార్య కొండాలక్ష్మణ్ బాపూజీకి ఈ కవితా సంపుటి అంకితం చేసారు కవి భీంపల్లి శ్రీకాంత్. తొలి, మలిదశ (1969-2009) తెలంగాణ ఉద్యమంలో ప్రత్యేకమైన విశిష్టపాత్ర వహించిన కొండాలక్ష్మణ్ బాపూజీపై 'మొగ్గలు' రూప ప్రక్రియలో రాసిన చిరు కవితల సమాహారం ఇది. ఆచార్య మసన చెన్నప్ప, డా॥వంగరి భూమయ్య చక్కటి ముందు మాటలు రాసారు. కేవలం ఏవాక్యాల్లో కవిత్వభావం- స్వభావం బలంగా చెప్పే నూతన కవిత్వ ప్రక్రియ ఇది. శ్రీకాంత్ శ్రీకారం చుట్టారు దీనికి. 'తెలంగాణ తొలి మలి ఉద్యమపోరాటంలో పాల్గొని/ రాష్ట్రసాధన కోసం అహర్నిశలు తపించిన ధీరుడు/ తెలంగాణ ఆత్మగౌరవ



పోరాటానికి ప్రతీక బాపూజీ' (పేజి.13) అంటారు కవి. ఈరోజు గొప్పగా ఊరంతా చెప్పుకొనే స్వర్ణనంది' పురస్కారాలకు ఆధ్యుడు లక్ష్మణ్‌బాపూజీయే. ఇదే అంశం మొగ్గల్లో చెప్పారు. 'సినీ కళాకారులకు ప్రోత్సహించాలనే సదుద్దేశ్యంతో/ బంగారు వెండి కంచు నంది అవార్డులను ప్రవేశపెట్టిననాడు/ సినీ నిర్మాణానికి స్టూడియోలను ఏర్పరచింది బాపూజీ'-(పేజి:20). ఇలా లక్ష్మణ్‌బాపూజీ జీవితంలోని ఎన్నో ముఖ్యాంశాలు, ఘటనలో ఉద్యమ సంఘటనలు మంత్రిగా ఆయన చేసిన అభివృద్ధి, కృషి, పద్యరూపం (మొగ్గలు ప్రక్రియలో) అద్భుతంగా చెప్పి చరిత్రను అక్షరబద్ధంగా చేసిన డా॥భీంపల్లి శ్రీకాంత్ అభినందనీయులు. **(తెలంగాణ బాపూజీ, రచన: డా॥భీంపల్లి శ్రీకాంత్, ప్రతులకు: 8-5-38, టీచర్స్ కాలనీ, మహబూబ్‌నగర్-509001)**

**- తంగిరాల చక్రవర్తి**

# 'దేవుడు తప్పిపోయాడు'

విశేష పాఠకాదరణ పొందిన 'విల్సన్‌రావు కొమ్మవరపు' కవితా సంపుటి 'దేవుడు తప్పిపోయాడుపై పీఠికలు, విశ్లేషణలు 'ప్రేరణ'గా గ్రంధస్థం కావడం, అరవైపైగా సమీక్షలు రావడం సాహిత్యంలో ఆహ్వానించదగ్గ అంశం. దాదాపు డెబ్బైమంది రచనలతో 350 పేజీల గ్రంధంలో 74 కవితల సంపుటిపై స్పందనలను కలిమిశ్రీ సంపాదకత్వంలో వెలువరించారు. దేవుడు తనలో తానే తప్పిపోయాడని తీర్మానించుకొన్న కవి, మనిషి జీవితాన్ని తానే కాపాడుకుంటాడనే అభివ్యక్తీకరణ, ప్రశంసనీయమైన ప్రతీక చాతుర్యాన్ని



ప్రదర్శిస్తోంది. 'దేవుడా/ నువ్వెప్పుడూ నీలోంచి/ నువ్వు తప్పిపోతూనే ఉండు/ నన్ను నేనే ఈ నేలలో విత్తుకొని/ కొత్త జలానికి దోలిసి పడతాను' అంటారు. ఈ సంపుటిలో 'బువ్వగింజలు' కవితలో అన్నదాత కన్నీటి మేఘాలవేదన, 'జీవనపాఠం'లో రావూరి భరద్వాజ స్మృతి, 'అమ్మజెండా'లో తల్లిప్రేమ, 'దారిదీపంలో' జీవిత భాగస్వామి ప్రేమాస్పదత, 'వీరుడా-జయం' గద్దర్ ప్రస్థానం, ప్రపంచీకరణ, ఎలిజీలు, ఆవేదన దుఃఖప్రతిధ్వనంతో ప్రేమ పరిమళాలు వైవిధ్య భరితమైన వస్తు ఇతివృత్తాలతో సమకాలీన జీవన దృక్పధాలు ప్రతిబింబిస్తున్నాయి. నాన్న గురించిన కవితలో బతుక్కొక భరోసానిచ్చి కొత్త నక్షత్రాన్ని కనుగొన్న జ్ఞాని మా నాన్న' అంటారు విలక్షణ కవిత్వ వ్యక్తీకరణతో ప్రకృతి, కుటుంబ సామాజిక బాంధవ్యాలు, పల్లెజీవుల పట్ల ప్రేమాదరణ అరుదైన కవిగా విల్సన్‌రావు అభినందనీయులు. **(ప్రేరణ, దేవుడు తప్పిపోయాడు, రచన: విల్సన్‌రావు కొమ్మవరపు, 5-2-396/ ఎస్ఎస్/పి/పి42, రోడ్ నం.5, సాహెబ్ నగర్ కలాన్, వనస్థలిపురం, హైదరాబాద్)**

**- యర్రమిల్లి**

# వణికించే చలిలోనూ మెరిసిపోదాం



### చలికాలంలో స్వెటర్

లేదా షాల్ వేసుకోవడం ఇష్టంలేనివారు సింపుల్‌గా తలచుట్టూ స్కార్ఫ్ చుట్టేసుకుని వెళ్లిపోతుంటారు. దీన్ని దృష్టిలో పెట్టుకునే డిజైనర్లు ఇప్పుడు ఇలా 'పాకెట్ స్కార్ఫ్'లను రూపొందించారు. ఈ స్కార్ఫ్‌లు కాస్త పొడుగ్గా ఉండటంతోపాటూ అదనంగా జేబులు కూడా వస్తాయి. కాస్త చలిగా



అనిపించినప్పుడు చేతుల్ని ఆ జేబుల్లోకి పెట్టుకునే విధంగా ఉంటాయివి. స్త్రీ-పురుషులిద్దరినీ దృష్టిలో పెట్టుకుని రూపొందించిన ఈ స్కార్ఫ్‌లు కూడా గళ్లూ, గీలూ, సాదా డిజైన్లలో ఉంటాయి కాబట్టి నచ్చినదాన్నే ఎంచుకోవచ్చు. వీటిల్లో కొన్ని హుడీతోనూ వస్తున్నాయి.

### లెగ్గింగ్‌లకు సాక్సుల డిజైన్లు



ఈ కాలంలో పిల్లలకు వీలైనంత వెచ్చదనాన్ని అందించేందుకు ప్రయత్నిస్తాం. వాళ్ల ఒళ్లంతా కప్పి ఉంచేవిధంగా లెగ్గింగ్స్, సాక్స్ వంటివే ఎక్కువగా వేస్తుంటాం. అయితే ఈసారి వాటన్నింటి బదులు ఈ ఒక్క టైట్స్‌ను ఎంచుకుంటే సరిపోతుంది. చూడ్డానికి ఇవి పాదాలవరకూ కప్పిఉంచే లెగ్గింగ్‌లు మారి ఉన్నా కాళ్ల దగ్గర సాదాగా లేకుండా సాక్సులు వేసినట్లుగా చారలూ, పూలూ, సీతాకోక చిలుకలూ, నక్షత్రాలూ, పోల్కాడాట్లూ వంటి డిజైన్లతో వస్తాయి. దాంతో చూసేవాళ్లకు లెగ్గింగ్‌లూ, సాక్సులూ



విడివిడిగా వేశారా లేదా రెండు కలిసే ఉన్నాయా అనే సందేహం కలగకమానదు అన్నమాట.

### స్వెటర్ అక్కర్లేదిక

జీన్-టీషర్ట్స్, వెస్ట్రన్‌వేర్‌ను ఎక్కువగా ఎంచుకునే ఈతరానికి స్వెటర్ పాత ఫ్యాషన్‌గా అనిపిస్తుంది. దీన్ని అర్థం చేసుకున్న ఫ్యాషన్ నిపుణులు.. ఈతరం కోసం ప్రత్యేకంగా 'సెవటర్ టాప్ స్కార్ఫ్ విత్ స్లీవ్స్'ను తీసుకొచ్చారు. అంటే ఇది సెవటర్ కాని స్వెటర్ అన్నమాట. స్లీవ్స్‌తో వచ్చే ఈ స్వెటర్ టాప్‌స్కార్ఫ్‌ను భుజాలమీదుగా వేసుకుంటే చాలు. స్కార్ఫ్ తరహాలో కనిపిస్తూనే చేతుల్ని కప్పి ఉంచుతుంది. ట్రెండీగా ఉండటంతోపాటూ అవసరాన్ని తీర్చే ఈ స్వెటర్ టాప్ స్కార్ఫ్



నచ్చిందా మరి!

## టూ ఇన్ వన్ శాలువా



శాలువా లేదా షాల్ అనగానే భుజాలమీదుగా కప్పుకునేదని ఎవరైనా టక్కున చెప్పేస్తారు. కానీ అది కూడా ఇంకాస్త వెరైటీగా, ట్రెండీగా ఉంటే బాగుండని కోరుకునేవారికి ఇప్పుడు 'షాల్ బ్లాంకెట్ విత్ బటన్స్' సరైన ఎంపికవుతుంది. కావడానికి ఇది కూడా శాలువాయే కానీ రివర్సబుల్ తరహాలో రెండువైపులా వేసుకునేలా ఒవైపు సాదాగా, మరోవైపు గళ్లతో వస్తుంది. అంతేనా దీనికి అదనంగా బటన్లు కూడా ఉంటాయి. కాబట్టి భుజాలమీదుగా కప్పుకున్నప్పుడు వాటిని పెట్టేసుకుంటే కేప్ వేసుకున్నట్లుగా అనిపిస్తుంది. లేదంటే మామూలుగానే ఉపయోగించుకోవచ్చు. ఇలా రెండు రకాలుగా ఉపయోగపడుతున్న ఈ షాల్స్ కూడా ఆకట్టుకునే డిజైన్లలో ఉంటున్నాయి.

## రివర్సబుల్ కలంకారీ జాకెట్

ఫ్యాషన్‌కు ప్రాధాన్యమిచ్చే మహిళలు స్వెటర్లనుకాకుండా జాకెట్లను ఎంచుకునేందుకు ఆసక్తి చూపిస్తుంటారు. అవి కూడా ఇప్పటికే చాలా రకాల డిజైన్లు, మోడళ్లలో వచ్చేశాయనేది తెలిసిందే. ఇప్పుడు ఆ జాకెట్లే ఇంకాస్త వైవిధ్యంగా మారిపోయి కొత్త లుక్‌తో కనికట్టు చేస్తున్నాయి. అవే ఈ 'క్విల్టెడ్ రివర్సబుల్ కలంకారీ జాకెట్స్'. కలంకారీ డిజైనులో కాస్త మందంగా ఉండే ఈ జాకెట్స్‌ను రెండురకాలుగా వేసుకోవడమే వీటి ప్రత్యేకత. ఒకవైపు హెవీ డిజైనుతో మరోవైపు సాదాగా లేదా తక్కువ డిజైనుతో రెండు రంగుల్లో వచ్చే ఈ జాకెట్లు లాంగ్/షార్ట్/మీడియం మోడల్స్‌లో వస్తున్నాయి. ❑







# గల్ఫ్‌దేశాల్లో ఉన్నత విద్య

(4వ పేజీ తరువాయి)

కృత్రిమ మేధా పఠనం కోసం ప్రపంచం అంత పరుగులు పెడుతోంది. ఇది గమనించిన యుఏఈలో ముహమ్మద్ బిన్ సయీద్ యూనివర్సిటీ ఆఫ్ ఆర్టిఫిషల్ ఇంటెలిజెన్స్ 2019లో నెలకొల్పారు. దీని కోసం 2017లో కేవలం 27 సంవత్సరాల వయసున్న ఒమర్ బిన్ సుల్తాన్ అల్ ఓలంని మినిస్టర్ ఆఫ్ స్టేట్ ఫర్ ఆర్టిఫిషల్ ఇంటెలిజెన్స్‌గా నియమించి ఆ రంగాన్ని పరుగులు పట్టించారు. ఆ విధంగా ఇక్కడ శాస్త్రసాంకేతిక పఠనానికి ప్రయోగాలకు ఎన్నో సౌకర్యాలు సమకూర్చారు. యుఏఈలో దేశం, విదేశీ యూనివర్సిటీలు ఉన్నాయి. అందులో ప్రముఖమైనవి ముహమ్మద్‌బిన్ జాయిద్ యూనిర్సిటీ ఆఫ్ ఆర్టిఫిషిల్ ఇంటెలిజెన్స్, ఖలీఫా యూనివర్సిటీ, అజ్మన్ యూనిర్సిటీ, జాయేద్ యూనివర్సిటీ, యూనివర్సిటీ ఆఫ్ షార్జా, అబుదాబి యూనివర్సిటీ, అజ్మన్ యూనివర్సిటీ, యునివర్సిటీ ఆఫ్ దుబాయ్. ఇంకా విదేశీ యూనివర్సిటీల క్యాంపస్‌లు ఉన్నాయి. అవి అమెరికన్ యూనివర్సిటీ ఆఫ్ షార్జా, అమెరికన్ యూనివర్సిటీ దుబాయ్ కెనడియన్ యూనివర్సిటీ





దుబాయ్, న్యూయార్క్ యూనివర్సిటీ అబుదాబి, బిట్స్ పిలానీ తమ కార్య కలాపాలు ప్రారంభించింది. త్వరలో ఐఐటి కూడా ప్రారంభం అవుతుంది. ఆ విధంగా చూస్తే మనకి అనుకూలంగా ఉన్న దేశంలో విదేశీ విద్య నేర్చుకోవడానికి యుఏఈ కన్నా మించిన దేశం మరొకటి లేదు. ❑



కథ

# తెలివైన పక్షి

అడవిలో కొందరు గిరిజనులు తుమ్మచెట్ల నుండి జిగురు సేకరించి ఒక పెద్ద పాత్రలో నానబెట్టారు. చెట్టు నుండి సేకరించిన తుమ్మ జిగురు గట్టిగా ఉంటుంది. ఒక కార్యాలయం వారు ఎక్కువ తుమ్మ జిగురు కావాలని, నానబెట్టిన తుమ్మజిగురును తయారు చేసి ఇవ్వమని గిరిజనులను కోరారు. ఆ కారణంగా అతిపెద్ద పాత్రలో గట్టిగా ఉన్న తుమ్మ జిగురును నీళ్లల్లో నానబెట్టి వారంతా భోజనానికి వెళ్లారు. ఇంతలో ఒక అతిపెద్ద పక్షి ఆ పాత్ర చుట్టూ పడి ఉన్న ఆహార పదార్థాలు తింటూ పొరపాటున జిగురు ఉన్న పాత్రలో పడిపోయింది. దాని రెక్కలకు జిగురు అంటుకోవడం వల్ల ఎగరలేకపోయింది. ఇంతలో అక్కడకు ఒక నక్క వచ్చింది.



పక్షి దాన్ని చూచి 'నక్కబావా! నన్ను ఈ పాత్రలో నుండి బయటకు తీసి కాపాడవా?' అని ప్రాధేయపడింది.

'తప్పకుండా కాపాడతాను. అయితే నిన్ను పాత్రలో నుండి బయటకు తీయగానే నేను తినేస్తాను' అన్నది నక్క.

'నీ ఇష్ట ప్రకారమే నన్ను తిందువుగాని. ముందు నన్ను బయటకు లాగు' అన్నది పక్షి.

నక్క పక్షిని జిగురుతో నిండిన పాత్ర నుండి బయటకు తీసి దాన్ని తినేందుకు సిద్ధమౌతోంది. ఇంతలో పక్షి మాట్లాడుతూ 'నక్కబావా! నా రెక్కల నిండా జిగురు అంటుకుంది. ఇలా నన్ను నీవు తినడానికి ప్రయత్నిస్తే నీ నోరంతా జిగురుతో నిండి అసౌకర్యంగా ఉంటుంది. అందువల్ల నన్ను చెరువు వద్దకు తీసుకుని వెళ్లి నా రెక్కలను నీళ్లతో కడుగు. జిగురు పోయిన తరువాత ఎండలో నా రెక్కలను ఆరబెట్టుకుంటాను. అప్పుడు నన్ను తింటే ఆ రుచే వేరు' అని ఊరించింది.

ఇదేదో బాగానే ఉందని నక్క లొట్టలేసుకుంటూ పక్షిని చెరువు వద్దకు తీసుకునివెళ్లి రెక్కలపై నీళ్లు పోసి కడిగింది. కొద్దిసేపటికి పక్షి రెక్కలకు అంటుకున్న తుమ్మ జిగురంతా తొలగిపోయింది. పక్షి కొద్దిసేపు ఎండలో నిలబడటం వల్ల దాని రెక్కల తడి ఆరిపోయి తుర్రున ఎగిరి చెట్టు కొమ్మపై కూర్చుని నక్క నుండి ప్రాణాలు కాపాడుకుని తప్పించుకుంది. నక్క తన పాచిన పారనందుకు బిక్కమొహం వేసుకుని చూస్తూ నిలబడింది.

**- షేక్ అబ్దుల్ హకీంజాని**

## రంగులు వేయండి



## బాలగేయం

### చందమామ



వచ్చాడు వచ్చాడు
చల్లని మామ వచ్చాడు
చక్కని మామ వచ్చాడు
చీకటి పడగానే వచ్చాడు
చిరునవ్వుతో వచ్చాడు!
చీకటి పారద్రోలుతూ
వచ్చాడు!
చల్లని మామ వచ్చాడు
చక్కని మామ వచ్చాడు
చల్లని వెన్నెల
చిమ్ముతూ వచ్చాడు
చల్లని వెలుతురు
పంచుతూ వచ్చాడు
చల్లని హాయిని
వచ్చాడు వచ్చాడు
చందమామ
పెంచుతూ వచ్చాడు
చక్కగా ఆడుకోనిచ్చాడు
చక్కగా ఆనందం పంచాడు
చక్కగ మమ్మల్ని
దీవించాడు.

**- మా.శ్రీ.రాజు**

## హలో ఫ్రెండ్...

**చిన్నారుల ప్రశ్నలకు**

**వార్త సిఎండి, మేనేజింగ్ ఎడిటర్**

## గిరీష్ అంకుల్ సమాధానాలు

**- కీర్తి,** కొల్హాపూర్

ప్రశ్న: గిరీష్ సంఘీ అంకుల్ గారికి నమస్తే. నీటి లోపల కూడా సిమెంట్‌ని ఉపయోగించి బ్రిడ్జిలను ఏ విధంగా నిర్మిస్తారు?



**జవాబు: కీర్తి!** మన దేశంలో నీటి లోపల జరిగే నిర్మాణాల విషయంలో కొన్ని ప్రత్యేక పద్ధతులను అవలంబిస్తున్నారు. బ్రిడ్జి నిర్మించవలసిన చోట నీటి ప్రవాహం లేకుండా ఇసుకతో నింపిన బస్తాలతో అడ్డుకట్ట వేసుకొని నిర్మిస్తున్నారు. నీటి ప్రవాహం బాగా ఎక్కువగా ఉండే ప్రాంతంలో అయితే బ్రిడ్జి స్తంభాలు నిర్మించే చోట వెల్ ఫౌండేషన్‌ను ఏర్పాటు చేసుకొని నీటిని తోడివేస్తారు. ఆ తరువాత కాంక్రీట్‌తో స్తంభాలను నిర్మిస్తారు. ఇతర దేశాలలో అయితే నీటి లోపల బ్రిడ్జిలను నిర్మించే సందర్భంలో ఒక ప్రత్యేకమైన సిమెంట్ వాడతారు. సాధారణ సిమెంట్ కంటే, తక్కువ వ్యవధిలోనే ఈ సిమెంట్‌తో తయారైన కాంక్రీట్ దృఢతరంగా గట్టిపడుతుంది.

**- ఎస్.మనీష్,** కాకినాడ

ప్రశ్న: గిరీష్ సంఘీ అంకుల్ గారికి నమస్తే. పారాచూట్స్‌ను సాధారణంగా ఎందుకు ఉపయోగిస్తారు?



**జవాబు: మనీష్!** భూమికి ఎత్తుగా ఉన్న ఆకాశంలో నుంచి మనుషులనుగానీ, వస్తుసామాగ్రినిగానీ నెమ్మదిగా భూమి మీదకు దించేందుకు పారాచూట్స్‌ను వాడటం సర్వసాధారణం. అంతేకాదు, వెడల్పు తక్కువగా ఉండే రన్‌వేల మీద వేగంగా ప్రయాణించే కార్లకూ, విమానాలకూ బ్రేక్ వేసేందుకు కూడా వీటిని వాడటం కద్దు.



# జగమంతా పిక్నిక్

**కార్తిక** మాసంలో మనదేశంలో వనభోజనాలు చేస్తుంటారు. ఉసిరిచెట్టు నీడన భోజనం చేస్తే ఆరోగ్యానికి మంచిదని, సమస్త పాపాలు తొలగిపోతాయని 'కార్తీక పురాణం' చెబుతోంది. పలు దేశాలు కూడా వనభోజనాల సంస్కృతి మధ్యయుగం నాటికే వ్యాప్తిలో ఉండేది. ఇంగ్లీష్‌లో వనభోజనాలకు 'పిక్నిక్' అనే పేరు ఉంది. 'పెక్' లేదా 'పిక్' అంటే 'ఏరటం', 'నిక్' అంటే స్వల్ప పరిమాణం అని అర్థం. ఇది ఫ్రెంచ్ మాటలు. 'పిక్', 'నిక్' అనే ఈ రెండు మాటల కలయికతో 'పిక్నిక్' అనే మాట ఏర్పడింది. ఇంగ్లీష్‌లో ఈ మాట పదహారో శతాబ్దంలో వాడుకలోకి వచ్చింది. పాశ్చాత్య దేశాల్లో సంపన్నులు తీరిక వేళల్లో బంధుమిత్రులతో కలిసి ఊళ్లకు దగ్గర్లో ఉండే వనాలకు వెళ్లి, రోజంతా అక్కడే విందు వినోదాలతో కాలక్షేపం చేసేవారు. చాలాదేశాలు ఈ పిక్నిక్‌లను పాటిస్తున్నారు. వాటిని గమనిద్దాం.

## అర్జెంటీనాలో పిక్నిక్

అర్జెంటీనా ప్రజలు ఏటా క్రిస్మస్ సీజన్‌లో పిక్నిక్‌లు జరుపుకొంటారు. మంచు కురిసే ఈ కాలంలో ఆరుబయట వనభోజనాలు చేయడానికి అర్జెంటీనా ప్రజలు ఆసక్తి చూపుతారు. అర్జెంటీనాలో ఏటా డిసెంబరు 8 నుంచి క్రిస్మస్ సీజన్ మొదలవుతుంది. డిసెంబర్ 8న 'ఇమ్మాక్యులేట్ కాన్సెప్షన్ డే' జరుపుకొంటారు. ఆ రోజున మేరీమాత పాపవిమోచన పొందిందని కేథలిక్‌ల నమ్మకం. అర్జంటీనాలో డిసెంబర్ 8న ప్రభుత్వ సెలవు దినం. దేశంలో పిక్నిక్‌ల సందడి కూడా అప్పటి నుంచే మొదలువుతుంది. కొందరు వనాల్లోను, తీరప్రాంతాల్లో ఉండేవారు సముద్ర తీరంలోను ఆరుబయట విందు వినోదాలతో పిక్నిక్‌లు చేసుకొంటారు. ఆరుబయట మంటలు వేసి, కోడి, టర్కీ, మేక, పంది వంటి వాటి మాంసాలను కాల్చుకుని, వాటితో విందు చేసుకుంటారు.



## ఫిన్‌లాండ్‌లో పిక్నిక్

ఫిన్‌లాండ్‌లో వసంత రుతువు కాస్త ఆలస్యంగా మొదలవుతుంది. మేడే నుంచి దేశంలో పిక్నిక్‌ల హడావుడి మొదలవుతుంది. నిజానికి మేడే పిక్నిక్‌ల కోసం జనాలు ఏప్రిల్ 30 నుంచే హడావుడి ప్రారంభిస్తారు. ఊళ్లకు వెలుపల ఉండే చిట్టడవులు, పార్కులు, సముద్ర తీరాల్లో ఎక్కువగా



పిక్నిక్‌లు చేసుకుంటారు. అట్టహాసంగా విందు వినోదాలతో జరిగే పిక్నిక్‌లలో సంప్రదాయబద్ధంగా వడ్డించే మధ్యాహ్న భోజనాన్ని 'హెరింగ్ లంచ్' అంటారు. ఉప్పుచేపలు, ఊరవేసిన చేపలు, బంగాళ దుంపలు, ఆరుబయట నిప్పుల మీద కాల్చిన మాంసాహార పదార్థాలతో విందు భోజనాలు చేస్తారు. వెండిరంగులో మెరిసే చిన్నచేపలను 'హెరింగ్' అంటారు. సంప్రదాయక ఫిన్నిష్ పిక్నిక్ విందులో హెరింగ్ చేపలు తప్పనిసరి.

## క్లీన్ మండే: గ్రీస్

క్రైస్తవుల ఉపవాస దినార్థం 'గ్రేట్ లెంట్' తొలి రోజును 'క్లీన్ మండే' అంటారు. క్లీన్ మండే రోజున విందు వినోదాలతో గడుపుతారు. గ్రీస్‌లో క్లీన్ చిట్టడవులు, సముద్ర తీరాల్లో



గుమిగూడి పిక్నిక్‌లు జరుపుకొంటారు. పిక్నిక్ సందర్భంగా చిత్రవిచిత్రమైన రంగురంగుల గాలిపటాలను ఎగురవేయడం గ్రీస్ ప్రజల ఆనవాయితీ. పిక్నిక్ విందులో సంప్రదాయబద్ధంగా చేసే రొట్టెలు, ఆల్చిప్పలు, ఆక్టోపస్, పీతలు, రొయ్యలతో చేసిన వంటకాలను ఆరగిస్తారు. మధ్యాహ్నం విందు తర్వాత పిల్లలు, పెద్దలు గాలిపటాలను ఎగురవేస్తారు.



## అమెరికా పిక్నిక్

అమెరికాలో నేషనల్ పిక్నిక్‌డే ఏప్రిల్ 23న జరుపుకొంటారు. దేశంలో అప్పటి నుంచే పిక్నిక్‌ల హడావుడి మొదలవుతుంది. మే 27న జరుపుకొనే మెమొరియల్ డే మొదలుకొని నవంబర్ 11న జరుపుకొనే వెటరన్స్ డే వరకు అమెరికాలో పిక్నిక్ సీజన్‌గానే పరిగణిస్తారు. అమెరికా స్వాతంత్ర్య దినోత్సవమైన జులై 4న ఎక్కువమంది పిక్నిక్‌లు జరుపుకొంటారు. దాదాపు ఆరునెలల పాటు కొనసాగే పిక్నిక్



సీజన్‌లో బంధుమిత్రుల బృందాలు మాత్రమే కాకుండా, కార్పొరేట్ సంస్థలు కూడా ఉద్యోగుల కోసం పిక్నిక్ పార్టీలు నిర్వహిస్తూ ఉంటారు. ఎక్కువగా పార్కులు, తోటలు, సముద్ర తీరాల్లో బార్బెక్యూ పిక్నిక్ పార్టీలు చేసుకుంటారు.

## ఆస్ట్రేలియా

ఆస్ట్రేలియాలో ఆగస్టు మొదటి సోమవారాన్ని పిక్నిక్ డేగా పాటిస్తారు. వేర్వేరు చోట్ల నుంచి వచ్చి ఆస్ట్రేలియా గనుల్లో పనిచేసే గని కార్మికులు పంతొమ్మిదో శతాబ్దిలో ఇక్కడ పిక్నిక్ సంస్కృతిని ప్రారంభించారు. 1881లో బలారాట్ మైనర్స్ అసోసియేషన్ తొలిసారిగా అబ్బరీ బొటానికల్ పార్కులో వేలాదిమంది కర్మికులతో భారీ పిక్నిక్ నిర్వహించింది. ఆస్ట్రేలియాలో 1940ల నాటికి దేశవ్యాప్తంగా రైల్వేలైన్వు ఏర్పడటంతో ఆగస్టు మొదటి సోమవారాన్ని రైల్వే హెరిటేజ్ పిక్నిక్‌డేగా పాటించడం ఆనవాయితీగా మారింది.



## న్యూజిలాండ్

న్యూజిలాండ్‌లో పిక్నిక్ సంస్కృతి పందొమ్మిదో శతాబ్దిలో బ్రిటిష్ పాలకుల ద్వారా మొదలైంది. దక్షిణార్ధగోళంలో ఉన్న న్యూజిలాండ్‌లో నవంబర్ నుంచి వసంత రుతువు మొదలవుంది. వసంతకాలంలో ఇక్కడ ఆరుబయట పిక్నిక్‌లు జరుపుకొంటారు. న్యూజిలాండ్ సంప్రదాయ పిక్నిక్‌లలో టీ పార్టీలు ప్రత్యేకం. పిక్నిక్‌ల కోసం జనాలు ఉదయాన్నే టోలు, చిట్టడవులు, సముద్రతీరాలు వంటి ఆరుబయటి ప్రదేశాలకు చేరుకుంటారు. ఆటపాటలతో కాలక్షేపం చేస్తారు.



## ఫ్రాన్స్

ఫ్రాన్స్‌లో ఏటా జులై 14న నేషనల్ పిక్నిక్ డే జరుపుకొంటారు. ఈరోజు 'బాస్టీల్ డే' అని కూడా అంటారు. ఆ రోజున పిక్నిక్ సందడి ఎక్కువగా కనిపిస్తుంది. ఫ్రాన్స్‌లో ఏటా వేసవి పిక్నిక్‌లు జరుపుకోవడానికి అనుకూలమైన కాలం. అందువల్ల వేసవి పొడవునా ఫ్రెంచ్ ప్రజలు సెలవు రోజుల్లోను, తీరిక వేళల్లోను ఆరు బయట పిక్నిక్‌లు చేసుకుంటారు. ఫ్రెంచ్ విప్లవానికి ముందు పిక్నిక్ సంస్కృతి కేవలం సంపన్నులకే పరిమితమై ఉండేది. ఫ్రెంచ్ విప్లవం తర్వాత సామాన్యులకు సైతం ఇది పాకింది. సంప్రదాయ ఫ్రెంచ్ పిక్నిక్ విందుల్లో సంప్రదాయ వంటకాలతో పాటు మద్యానికి కూడా అమిత ప్రాధాన్యం ఉంటుంది. నృత్యగానాలలో ఓలలాడతారు.


### రచనలకు ఆహ్వానం

రచయితల నుండి కథలు, కవితలు, సమకాలీన వ్యాసాలు స్వాగతిస్తున్నాం. రచనలతో పాటు మీ పేరు, చిరునామా, హామీపత్రం తప్పనిసరిగా జతచేయాలి. ఎంపిక కాని రచనలు తిప్పి పంపగోరేవారు తగిన పోస్టేజీ జత చేసిన కవరు పంపించాలి. ఇతర పత్రికల పరిశీలనలో ఉన్న రచనలు పంపించ కండి. రచనలు పంపించాల్సిన చిరునామా:

ఎడిటర్, ఆదివారం వార్త, నం.396,
లోయర్ ట్యాంక్ బండ్, డిబిఆర్ మిల్స్ పక్కన, హైదరాబాద్-80.
sunmagvaartha@gmail.com

కథ

# గురుబ్రహ్మ

కె.వి.రామదాసు

అన్ని స్టేషన్లల్లోలాగే ఆ స్టేషన్లో కూడా అడుగిడగానే ఎదురుగా గోడకి గాంధీ తాతతో పాటు యితర జాతీయ నాయకుల ఫోటోలు వేలాడుతున్నాయి.

ఒక ఎస్ఐ, మరో ఏఎస్ఐ, ఓ హెడ్ కానిస్టేబుల్, అరడజను కానిస్టేబుల్స్ విధులు నిర్వర్తించే పోలీస్ స్టేషన్ అది. చుట్టూ ప్రహరీగోడ కలిగిన ఓ పెద్ద ప్రాంగణంలో రెండొందల గజాల స్టేషన్. వచ్చిపోయేవారి కోసం వరండాలో ఓ పాత బెంచీ వేయబడి వుంది. అది విరిగేందుకు సిద్ధంగా వున్నందువల్ల వచ్చేవారంతా బయట ప్రాంగణంలో ఏపుగా పెరిగిన వేపచెట్టు నీడలోనే ఎదురు చూస్తూ వచ్చిన పని చూసుకుని పోతుంటారు.

ఎండలో వచ్చిన రఘురాం ఆ స్టేషన్ వరండాలో వున్న ఎవరూ ఉపయోగించని ఆ బెంచిపై కూలబడి బడలిక తీర్చుకున్నాడు. అక్కడి పోలీసులు, అతడు ఆ వయసులో అంత కష్టపడి ఎందుకొచ్చాడో? అని ఆరా తీసే ప్రయత్నం కూడా చేయలేదు. ఇంతలో ఏఎస్ఐ మురళి లోపలి నుండి బయటకొచ్చి రఘురాంని చూసి "ఊ.. మళ్లీ వచ్చాడూ" అని మనసులో అనుకుని పట్టించుకోకుండా వెళ్లబోయాడు.

"సార్... ఒక్కసారి నా మాట వినండి" అంటూ ఏఎస్ఐని బతిమలాడుకున్నాడు రఘురాం.

"ఓ పెద్దాయనా! ఎన్నిసార్లు యిక్కడికి రావద్దని, వచ్చినా ఏ ఫలితం వుండదనీ. అయినా వస్తూనే వున్నావు. నీది వృధా శ్రమ. వెళ్లిపో. అసలే ఈరోజు కొత్త ఎస్ఐ వస్తున్నారు" కటువుగా వున్నాయి మురళి మాటలు.

రఘురాంకి ఈ మాటలు కొత్త కాదు. కాకపోతే ఆ మాటల్లో కొత్తగా వినిపించింది 'కొత్త ఎస్ఐ వస్తున్నారన్నదే'. ఈ విషయం అర్థమవగానే అతడి కళ్లు మెరిసాయి. రాబోయే కొత్త ఎస్ఐ అయినా తనకి న్యాయం చేస్తారేమో.. అన్న ఆశ అతడి మదిలో తొంగి చూసింది. ఇంతలో లోపలి నుండి హెడ్ కానిస్టేబుల్ అక్కడికొచ్చి రఘురాం జబ్బ పట్టుకుని "ఇన్స్పెక్టరుగారు యిక్కడి నుంచి పొమ్మని చెప్పారుగా. అర్థం కాలేదా" అంటూ రఘురాంని అక్కడి నుండి ఆరుబయటకి నెట్టేసాడు.

సూర్యుని కాంతి శిరస్సుని తాకేసరికి తాళలేక లేని ఓపికని తెచ్చుకుని అక్కడున్న వేపచెట్టుకేసి అడుగులేసాడు రఘురాం.



ఇంతలో ఓ రెండు పోలీస్ వాహనాలు వేగంగా వచ్చి పోలీస్ స్టేషన్ ఆవరణలో ఆగాయి. వచ్చే ఆ అధికారి ఎవరా? అని అక్కడున్న వారంతా ఎగాదిగా చూస్తున్నారు.

నిగనిగ మెరుస్తున్న బ్రౌన్ కలర్ షూ ధరించిన కుడి కాలు జీపులోంచి కింద పడింది. నలగని ఇస్త్రీ చేసిన టైట్ ఖాకీ పేంటుపైన ఇన్ చేసి మడత నలగని ఖాకీషర్ట్ ధరించిన ఓ మెరుపుతీగ లాంటి అమ్మాయి కిందకి దిగింది. అందమైన శరీర ఆకృతికి తోడు స్టైల్ తోడైతే, అన్నట్టుగా మొహానికి నల్లటి గాగుల్స్ మరింత అందాన్ని యిచ్చాయి ఆమెకి.

చేతిలో లాఠీతో ఠీవిగా ఒక్కొక్క అడుగు ఆమె ముందుకి వేస్తుంటే అక్కడున్న అందరూ ఆమె పైనుండి చూపు తిప్పుకోలేకపోయారు.

అక్కడి పోలీస్ స్టాఫ్ మొత్తం ఎటెన్షన్లో నిలబడి ఆ కొత్త ఎస్ఐకి సెల్యూట్ చేస్తూ స్వాగతం పలికారు.

"వెల్కమ్ మేడమ్" అంటూ పూల బొకేతో స్వాగతం పలికాడు ఏఎస్ఐ మురళి.

చిరునవ్వుతో థాంక్స్ చెబుతూ స్టేషన్లోకి అడుగు పెట్టింది ఆమె.

............

"ఈవిడే కొత్త ఎస్ఐ, పేరు గౌరి" అంటూ కానిస్టేబుల్స్ తమలో తాము గుసగుసలాడుకున్నారు.

ఎస్ఐ వెనుకే నడిచిన ఏఎస్ఐ ఆమెకి పోలీస్ స్టేషన్ మొత్తం చూపిస్తూ "ఇది మీ సీటు" అంటూ సెపరేట్ రూమ్లో ప్రత్యేకంగా వున్న టేబుల్, ఛైర్ చూపించాడు. టేబులుపై కొన్ని ఫైల్స్, ఓ లేండ్లైన్ ఫోన్, గ్లోబ్ వున్నాయి. అన్నీ కాస్త నీట్గా కనబడేసరికి తన రాకకోసమే ఆ టేబుల్ని శుభ్రపరచినట్లు ఆమె గ్రహించింది. ఆమె ఆ కుర్చీపై కూర్చోగానే ఏఎస్ఐ స్టాఫ్ని ఒక్కొక్కరిగా అక్కడికి పిలిచి అందరిని ఆమెకు పరిచయం చేసాడు.

అలాగే స్టాఫ్కి "ఈమె గౌరి, ఎస్ఐగా ప్రమోషన్ మీద మన స్టేషన్కి వచ్చారు. ఈ రోజు నుండి ఈమే మన హెడ్డ్" అంటూ పరిచయం చేసాడు.

పోలీస్ స్టేషన్ని మొత్తం నిశితంగా పరిశీలించింది గౌరి. మరకలతో పెచ్చులూడిపోయిన గోడలూ, ఊడటానికి సిద్ధంగా వున్న పైకప్పు ఫేనులూ, రంగులూడిపోయిన ఊచలతో వున్న లాకప్ రూమ్, ఓ మూల స్టేండ్కి రస్ట్ పట్టిన రైఫిల్స్ దిష్టిబొమ్మల్లా ఆమెకి దర్శనమిచ్చాయి. ఆ స్టేషన్ దుస్థితి ఆమెకి అరగంటలోనే అర్థమైపోయింది.

"మురళిగారూ! మన అండర్లో వున్న పెండింగ్ కేసుల ఫైల్స్ని నా టేబుల్పై వుంచండి. అలాగే ఈ పోలీస్ భవనాన్ని ఆధునీకరించడానికి అవసరమయ్యే ప్రపోజల్ సిద్ధం చెయ్యండి, ఎస్పిగారితో మాట్లాడి వెంటనే నిధులు మంజూరు చేయించే బాధ్యత నాది. నెల తిరిగేసరికి ఈ స్టేషన్ రూపురేఖలు పూర్తిగా మారిపోవాలి" అంది గౌరి.

వచ్చీ రావడంతోనే విధులలో డైరెక్టుగా తల దూర్చిన ఆమె తీరు చూసి ఈమె సామాన్యురాలు కాదని అనుకున్నారు అక్కడి స్టాఫ్. కాసేపు పిచ్చాపాటి మాట్లాడిన స్టాఫ్ గౌరి ఆజ్ఞపై వారి వారి సీట్లకి వెళ్లి ఎవరి పని వారు చూసుకోసాగారు. చెట్టునీడలో నిలబడి కొత్త ఎస్ఐ కోసం పోలీసులు చేసిన హంగామా అంతా గమనించిన రఘురాం, వారంతా లోపలికి వెళ్లిపోవడంతో మళ్లీ స్టేషన్‌కేసి కదలి అక్కడున్న వరండాలో బెంచిపై చతికిలపడ్డాడు. కొత్త ఎస్ఐని కలిసే అవకాశం కోసం ఆశతో ఎదురు చూసాడు.

సుదీర్ఘంగా ఫైల్లో లీనమైన గౌరి ఓ కేస్ డీటైల్స్‌ని గంటలో స్టడీ చేసి రూమ్ నుండి బయటకొస్తూ "బయటకెళ్తున్నా.. ఏదైనా అవసరమైతే నా మొబైల్‌కి కాల్ చెయ్యండి" అంటూ హెడ్ కానిస్టేబుల్ని తనతో వెంటబెట్టుకుని బయటకి నడిచింది.

**"ఆ... మాస్టారూ.. యిప్పుడు చెప్పండి పోలీస్ స్టేషన్‌తో మీకు ఏం పని?" అడిగింది గౌరి.**

**"మా అమ్మాయి సంధ్య నీకు గుర్తుండే వుంటుంది కదా, ఆమె విషయం మాట్లాడదామని వచ్చాను" అన్నాడు.**

చార్జి తీసుకున్న ఏ వారానికో, నెలకోగానీ పనిని సీరియస్‌గా తీసుకోని ఎస్ఐలనే అప్పటివరకు చూసిన మురళి, గంటలో డ్యూటీలోకి దిగిన గౌరిని చూసి ఆమెను వృత్తి పట్ల వున్న నిబద్ధతకి మనసులోనే మెచ్చుకోకుండా వుండలేకపోయాడు. సైదులు ముందు నడవగా, గౌరి ఫైల్ చేతిలో పట్టుకొని వరండా మీదుగా వడివడిగా నడచుకుంటూ తన వాహనం వైపు కదిలింది.

కొత్త ఇన్‌స్పెక్టర్ బయటకి రావడం చూసిన రఘురాం "మేడమ్.. అమ్మా" పక్క నుండి తనని చూసీ చూడనట్టు వెళ్తున్న గౌరిని ఉద్దేశించి శక్తికొద్దీ గట్టిగా పిలిచే ప్రయత్నం చేసాడు. కానీ ఆ మాటలు అతడి నోటి నుండి బయట పడలేదు. గౌరికి ఎవరో తనని పిలిచినట్టనిపించినా పని మీద దృష్టితో వడివడిగా అడుగులు వేస్తూ ముందుకి కదిలింది. బెంచి మీద కూర్చున్న పెద్దాయన ఎందుకో తనని పలకరించినట్టు అనిపించిచేసరికి మెదడు ఆ పెద్దాయన ముఖచిత్రాన్ని ఆమె మనోఫలకంపై తిరిగి ముద్రించింది. మెదడుకి ఏవో సిగ్నల్స్ అందేసరికి ముందుకు నడుస్తున్న ఆమె అడుగులు ఒక్కసారిగా ఆగి వెనుతిరిగి చూసింది. బెంచి మీద పెద్దాయన తనకేసే చూస్తున్నాడు. అప్పుడు నిశితంగా గమనించింది ఆయనని.

............

ఏదో అనుమానంతో వెనుతిరిగి ఆ పెద్దాయనకేసి గౌరి అడుగులు పడ్డాయి. తనకేసి తిరిగి వస్తున్న గౌరిని చూసి రఘురాం కళ్లు వెరిసాయి.

ఇది గమనించిన హెడ్ కానిస్టేబుల్ గౌరితో "మేడమ్, ఆ పెద్దాయన మాటలు పట్టించుకోకండి. మనం వెళ్దాం పదండి" అన్న మాటల్ని ఆమె పట్టించుకోలేదు. ఇంతలో ఆ హెడ్ కానిస్టేబుల్ "ఓ పెద్దాయనా, యిక్కడికి రావద్దని నీకు చెప్పానా" అంటూ రఘురాంకేసి ఉరుముతూ చూసాడు.

"ఆగు సైదులూ" అంటూ హెడ్ కానిస్టేబుల్‌ని వారించింది గౌరి.

రఘురాంని సమీపించి గౌరి ఎగాదిగా అతడికేసి నడిచింది. క్రమేపీ ఆమె మొహంలో ఆనందాశ్చర్యాలు తొణికిసలాడాయి. "సార్...మీరు..మీరు... రఘురాం మాస్టారు కదా" ఆనందంగా అంది గౌరి.

అధికారిణి తనని పేరు పెట్టి పిలిచేసరికి ఈ అధికారిణి ఎవరు చెప్మా? అనుకుంటూ ఆమెని గుర్తు పట్టేందుకు ప్రయత్నించాడు.

"నేను మీ స్టూడెంట్ గౌరిని మాస్టారూ. రాజమండ్రిలో మీరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో లెక్కల మాస్టారుగా వున్నప్పుడు మీ దగ్గర చదువుకున్నాను. మీ యింటికి వచ్చి కూడా ట్యూషన్ చెప్పించుకొనే దానిని. గుర్తు పట్టారా?" అంటూ ఎక్సైట్‌మెంట్‌తో తనని పరిచయం చేసుకుంది గౌరి. ఆమెని గుర్తు పట్టడానికి ప్రయత్నించాడు. కాసేపటికి "మిద్దే గౌరివి కదా" అంటూ పేరుతో సహా ఆమెని గుర్తుపట్టాడు రఘురాం.

"ఇన్ని సంవత్సరాలు గడిచినా నన్ను గుర్తు పట్టగలిగినందుకు చాలా సంతోషంగా వుంది మాస్టారూ. నన్ను ఆశీర్వదించండి" అంటూ వంగి రఘురాం పాదాలకి నమస్కరించింది గౌరి.

గౌరి చర్యకి రఘురాం కంగారు పడుతూ "లే..లే తల్లీ" అంటూ ఆమెని బుజాలు పట్టుకుని లేపాడు.

అక్కడున్న వాళ్లంతా ఆ దృశ్యాన్ని చూసి ఓ ఎస్ఐ సామాన్యమైన మాస్టారి పాదాలకి నమస్కరించడమేంటని అబ్బురపడ్డారు.

"మాస్టారూ.. మీరు యిలా పోలీస్ స్టేషన్‌కి రావడమేంటి?" అంటూ తన సందేహాన్ని వ్యక్తపరిచింది గౌరి.

"అదీ.. అదీ.." అంటూ సైదులుకేసి సందేహిస్తూ చూసాడు రఘురాం. ఇది గమనించిన గౌరి "సైదులూ, నువ్వు నాతో రానవసరం లేదు. అలాగే డ్రైవర్ కూడా అవసరం లేదు. నేనే వెళ్తా. నువ్వు యిక్కడే వేరే పని చూసుకో" అంది. "ఓకే మేడమ్" అంటూ సైదులు స్టేషన్‌లోకి వెళ్లిపోయాడు.

"ఆ.. మాస్టారూ.. మీరు నాతో రండి. మనం వెళ్తూ మాట్లాడుకుందాం" అంది గౌరి. రఘురాం ఆమెని అనుసరించాడు.

ఇద్దరూ కలసి పోలీస్ వాహనం ఎక్కి అక్కడి నుండి కదిలారు. గౌరి స్వయంగా డ్రైవ్ చేసుకుంటూ తిన్నగా వెళ్లి ఓ పెద్ద మోటల్ ముందు ఆపింది. లేడీ ఇన్‌స్పెక్టర్ తమ హోటల్‌కు రావడం చూసి కాస్త కంగారు పడ్డాడు అక్కడి మేనేజర్. వెంటనే బయటకొచ్చి వారిని ఆహ్వానించాడు. ఇద్దరూ తిన్నగా వెళ్లి ఫ్యామిలీ రూమ్‌లో కూర్చున్నారు. ఇంతలో మేనేజరే స్వయంగా వచ్చి వారికి ఏం కావాలో అడిగాడు.

"రెండు స్ట్రాంగ్ కాఫీలు పంపు" అంది గౌరి. నిమిషాలలో పొగలు కక్కుతున్న రెండు కాఫీలు వారి టేబుల్‌పై వుంచబడ్డాయి.

............

రఘురాం కాఫీ అందుకుని ఊదుకుంటూ గుటకలు వేసుకొని కొంచెం సిప్ చేసాడు. కాఫీ గొంతులో పడేసరికి అతడి మొహంలో కొంత రిలీఫ్ కనబడింది.

"ఆ... మాస్టారూ.. యిప్పుడు చెప్పండి పోలీస్ స్టేషన్‌తో మీకు ఏం పని?" అడిగింది గౌరి.

"మా అమ్మాయి సంధ్య నీకు గుర్తుండే వుంటుంది, ఆమె విషయం మాట్లాడదామని వచ్చాను".

"సంధ్య గుర్తు లేకపోవడమేమిటి మాస్టారూ? నేనూ సంధ్య ఒకే ఈడు వాళ్లం. నా కంటే సంధ్య ఒక సంవత్సరం పెద్దనుకుంటా. అక్కా అని పిలిచే దాన్ని అందరూ మేమిద్దరం అక్కాచెల్లెళ్ల లాగ వుంటామని అనేవారు. సంధ్య బాగుంది కదా?" అని అడిగింది.

"సంధ్య పెళ్లయింది. కొన్నేళ్లు వాళ్ల కాపురం బాగానే సాగింది. కానీ గత కొన్ని రోజులుగా ఏదో వంకతో గృహ హింసకి గురి చేస్తున్నారు. వారి కాపురం సజావుగా సాగడానికి నేను చేయవలసిన ప్రయత్నాలన్నీ చేసాను. ఒకే ఊళ్లో వుంటున్నా ఒక్క రోజు కూడా వాళ్లు సంధ్యని పుట్టింటికి పంపలేదు. ఈ మధ్య తన నుండి ఫోన్ కూడా రావడం లేదు. విసిగి ఇక పోలీసుల్ని ఆశ్రయించక తప్పలేదు".

సంధ్యని అత్తింటివారు వేధిస్తున్నారా? అంటూ గౌరి బాధపడింది. అయినా పోలీసులు కంప్లైంట్ ఎందుకు తీసుకోవడం లేదు. సంధ్య అత్తింటివారు అంత పరపతి గలవారా? అదే నిజమైతే తానుండగా అలా జరగనివ్వదు. అయితే కేసు రిజిస్టర్ చేసే ముందు కొంత ఎంక్వైయిరీ చేసి అసలు విషయం తెలుసుకోవాలనుకుంది.

"మాస్టారూ, యిప్పుడు ఈ ఊరి పోలీస్ స్టేషన్‌కి నేనే హెడ్డు. అక్క కేసు నేను చూసుకుంటాను" అంది.

రఘురాం సంధ్య వుండే ఎడ్రస్ చెప్పగా నోట్ చేసుకుంది గౌరి. అలాగే అతడు చెప్పిన మొబైల్ నంబర్ వెంటనే గౌరి తన ఫోన్‌లో టైప్ చేసి గురుబ్రహ్మ అంటూ సేవ్ చేసుకుంది. తన నంబరు కూడా మాస్టారుకి ఇచ్చి ఏదైనా అవసరమైతే ఫోన్ చెయ్యమంది. ఆ తరువాత మాస్టార్ని తన వాహనంలో ఆయన యింటికి దగ్గర్లో విడిచిపెట్టి వెంటనే సంధ్య విషయం ఏంటో చూద్దామని ముందుకు కదిలింది.

.............

సంధ్య ఇల్లు చేరి కాలింగ్ బెల్ నొక్కింది. కాసేపటికి తలుపు తెరచుకుని ఓ వ్యక్తి బయటకొచ్చాడు. ఎదురుగా పోలీసుని చూసి కాస్త కంగారు పడ్డాడు. వెంటనే తేరుకుని లోపలికి రమ్మన్నట్లు పక్కకి తప్పుకున్నాడు. గౌరి లోపలికి రాగానే ఆమెను అక్కడున్న సోఫాలో కూర్చోమన్నాడు.

"సంధ్యని కలవడానికొచ్చా, కాస్త పిలవండి. ఆమె స్నేహితురాలినని చెప్పండి. సంధ్యకి మీరు ఏమవుతారు?" అడిగింది ఆ వ్యక్తిని. సంధ్యని పిలవమనేసరికి గౌరి వైపు తొట్రుపాటుగా చూసాడా వ్యక్తి. "నా పేరు వినాయకరావు. నేను సంధ్య మామగారికి తమ్ముడ్ని, మీకు సంధ్య గురించి తెలిసినట్టు లేదు" అంటూ జరిగినదంతా వివరంగా చెప్పాడు.

వినాయకరావు చెప్పింది విన్న గౌరికి షాక్ తగిలింది. ఏం మాట్లాడాలో పాలుపోలేదు. నిశ్శబ్దంగా అక్కడి నుండి బయట పడింది. వెంటనే జీపుని పోలీస్ స్టేషన్‌కేసి పోనిచ్చింది.

.............

"మురళిగారూ, ఇక్కడికి రోజూ వస్తున్న రఘురాం మాస్టారు, అదే ఆ పెద్దాయన కేసు గురించి నేను విన్నది నిజమేనా?" డైరెక్టుగా ప్రశ్నించింది.

"అవును మేడమ్. మీరు విన్నది నిజమే. ఒక్క నిమిషం.. అంటూ షెల్ఫ్‌లో వున్న ఓ ఫైల్‌ని తీసి దులిపి ఆమె టేబుల్‌పై వుంచాడు. "మేడమ్, ఈ ఫైల్ సంధ్య కేసుకి సంబంధించింది. చదివితే మీరు విన్నది నిజమే నని నిర్ధారణ చేసుకోవచ్చు" అన్నాడు మురళి.



మరొక్క క్షణం ఆలస్యం చేయకుండా ఆ ఫైల్లో వున్న రిపోర్ట్‌ని టక టక చదివింది. అంతా గందరగోళంగా అనిపించింది. వెంటనే మాస్టారింటికి వెళ్లాలని నిర్ధారించుకుంది.

.............

రఘురాం యింటికి చేరుకుని గౌరి కాలింగ్‌బెల్లు నొక్కింది. కాసేపటికి తలుపు తెరుచుకుంది.

తలుపు తెరచిన ముత్తైదువును చూసి ఆమె మాస్టారి భార్యగా గుర్తు పట్టింది. "అమ్మా, మీరు సంధ్యతల్లి కనకమహాలక్ష్మిగారు కదూ" అంటూ లోపలికి అడుగు పెట్టింది. పోలీస్ ఇన్‌స్పెక్టర్‌ని చూసి కాస్త కంగారు పడినా ఎక్కడో ఆమెని చూసినట్టు అనిపించింది ఆమెకి. "నేను గౌరిని. చిన్నప్పుడు రాజమండ్రిలో మాస్టారి దగ్గర చదివిన అనేక మంది విద్యార్థుల్లో నేనూ వున్నాను. మీ ఇంట్లో, మీ సంధ్యతో ఎంతో చనువుగా మెలిగినదాన్ని మీరు సంధ్యతో పాటు నన్నూ మీ కూతుర్లా చూసుకొనేవారు" అంది గౌరి తనని తాను పరిచయం చేసుకుంటూ.

"గౌరివా! ఎలా వున్నావు? పోలీస్ ఉద్యోగం చేస్తున్నావా?" అని ప్రశ్నించింది.

"ఇక్కడే ఎస్ఐగా ఈ రోజే చార్జి తీసుకున్నాను. మాస్టారి కోసం వచ్చాను. ఆయన ఉదయమే మా పోలీస్ స్టేషన్‌కొస్తే గుర్తు పట్టి పరిచయం చేసుకున్నాను. మాస్టారు ఎక్కడ?"

"మాస్టారు పెరట్లో పూలమొక్కలకి నీళ్లు పోస్తూ కాలక్షేపం చేస్తున్నారు, కాసేపట్లో వస్తారు కూర్చో" అంటూ గౌరిని సోఫాలో కూర్చోమంది.

"ఫరవాలేదు, ముఖ్యంగా మీతో మాట్లాడానికే వచ్చాను" అంది గౌరి.

ఆ తరువాత వారిద్దరి మధ్యా సంధ్య విషయంలో చాలా సీరియస్ డిస్కషన్ జరిగింది. ఇంతలో "సంధ్య విషయం ఏమైనా తెలిసిందా గౌరీ?" అన్నాడు అప్పుడే అక్కడికొచ్చిన రఘురాం.

"ఆ పని మీదే వున్నాను మాస్టారూ. మిమ్మల్ని కలిసాగా. అమ్మని కూడా చూడాలనిపించి యిలా వచ్చా" సమాధానమిచ్చింది గౌరి.

ముగ్గురూ కాసేపు కబుర్లతో కాలక్షేపం చేసారు. తన రాక మాస్టారిలో ఎంతో ప్రశాంతతని తెచ్చినట్టు గమనించింది గౌరి.

.............

మర్నాడు పోలీస్ స్టేషన్‌కి రాగానే గౌరి ముందుగా గమనించింది.. వరండాల్లో బెంచి మీద మాస్టారు కూర్చుని తన కోసం ఎదురు చూడటం.

"మాస్టారూ, లోపల కూర్చోలేకపోయారా?" అని పలకరించింది.

"లోపలిని రమ్మని మేం చెప్పాం మేడం, మాస్టారు వినలేదు" అన్నాడు అక్కడున్న ఒక కానిస్టేబుల్. ఇన్నాళ్లు పట్టించుకోని మాస్టార్ని, తనకి అతను పరిచయస్తుడని తెలియగానే పోలీసుల తీరు మారిపోవడం గమనించి తనలో తానే నవ్వుకుంది గౌరి.

"గౌరీ! నాకు లోపలకంటే యిక్కడ కూర్చోవడమే యిష్టం" అంటూ సమాధానం ఇచ్చాడు రఘురాం.

"మాస్టారూ, మీ పని మీదే వున్నాను. మీ సమస్య పరిష్కరిస్తాను. మీరు నిశ్చింతగా యింటికి వెళ్లండి" అని అతనికి నచ్చచెప్పి రఘురాంని యింటికి పంపే ప్రయత్నం చేసింది గౌరి.

ఆమె మాట మీద గౌరవంతో రఘురాం మారు మాట్లాడకుండా మౌనంగా వెనుదిరిగాడు.

ఇలా నాలుగైదు రోజులుగా గౌరి స్టేషన్‌కి రాకముందే రఘురాం వచ్చి వరండాలో అదే బెంచిపై కూర్చుని ఆమె కోసం ఎదురు చూడటం, గౌరి ఆయనకి నచ్చచెప్పి పంపడం పరిపాటి అయిపోయింది.

మాస్టారి సమస్య పూర్తిగా సమసి పోయేవరకు ఆయన స్టేషన్‌కి రాకమానరని గౌరికి అర్థమైంది. గౌరికి మాస్టారి సమస్య ఎలా పరిష్కరించాలో పాలుపోలేదు. ఇక లాభం లేదనుకుని బాగా ఆలోచించి ఒక స్థిర నిశ్చయానికి వచ్చింది.

.............

లయబద్ధమైన సంగీతంతో కాలింగ్ బెల్ మోగేసరికి రఘురాం వెళ్లి తలుపు తీసాడు. మహాలక్ష్మిలా కళకళలాడిపోతూ ఎదురుగా నిలుచున్న కూతుర్ని చూడటానికి అతడికి రెండు కళ్లూ చాలలేదు.

"అమ్మా సంధ్యా! నువ్వా తల్లీ! ఎన్నాళ్లకు వచ్చావు? రా అమ్మా రా" అంటూ హాడివిడి చేస్తూ "కనకం, ఎవరొచ్చారో చూడు" అంటూ వంటింటికేసి కేకేసాడు.

కనకమహాలక్ష్మి బయటకొస్తూ సంధ్యని చూసి ఆశ్చర్యపోయింది. "ఇన్నాళ్లకి ఈ అమ్మ గుర్తుకొచ్చిందా?" చిన్న అలకని ప్రదర్శించింది.

"ఇద్దరూ సంధ్యని లోపలికి తోడుకొని వచ్చారు. కనకమహాలక్ష్మి కూతుర్ని చూసి సందడి చేసింది. వేడి వేడి ఫిల్టర్ కాఫీ తీసుకువచ్చి కూతురికిచ్చింది. సంధ్యకి చెరో వైపు కూర్చుని ముగ్గురూ ముచ్చట్లలో పడ్డారు. గలగల నవ్వుతూ ఉత్సాహంగా కబుర్లు చెబుతున్న కూతుర్ని చూసి అత్తింటివారి వేధింపుల గురించి అడిగి చక్కటి వాతావరణాన్ని పాడు చేయదలచుకోలేదు రఘురాం.

............

కనకమహాలక్ష్మి కూతురు వచ్చిన సందర్భంగా రకరకాల వంటలు చేయడానికి ఉపక్రమించింది. తల్లికి సహాయంగా వంటగదిలోకి వెళ్లింది సంధ్య. వారికి దగ్గర్లోనే రఘురాం కుర్చీ వేసుకుని కూర్చుని వారి ముచ్చట్లని వింటూ మధ్య మధ్యలో మాట కలుపుతున్నాడు. చాలా రోజుల తరువాత ముగ్గురూ తృప్తిగా భోజనం ముగించారు. "సంధ్యా, సాయంత్రమే వెళ్లిపోవాలా? ఓ రెండు రోజులు వుండకూడదూ" అన్నాడు రఘురాం.

"లేదు నాన్నా.. మా వాళ్లకి వచ్చేస్తానని మాటిచ్చాను. మళ్లీ నేను మిమ్మల్ని చూడటానికి రావాలంటే నా మాట నిలబెట్టుకోవాలి" సమాధానమిచ్చింది సంధ్య.

రఘురాం అలా వాలుకుర్చీలోనే నిద్రలోకి జారుకున్నాడు. సంధ్య రాక మనసుకి ఎంతో ప్రశాంతతనిచ్చేసరికి ఒళ్లు తెలీకుండా నిద్రపోయాడు. పొద్దుపోయాకగానీ తెలివిరాలేదు... అదీ సంధ్య నిద్ర లేపితే.

"నాన్నా, నేను బయలుదేరుతున్నాను. క్యాబ్ బుక్ చేసాను. మరికొద్దిసేపట్లో వస్తుంది" ఇంతలో కనకమహాలక్ష్మి ఓ పళ్లెంలో పట్టుచీరె, రవిక, పసుపు-కుంకుమలతో పాటు తాంబూలం తీసుకువచ్చి సంధ్యకి యిచ్చింది. అవి తీసుకుంటూ సంధ్య తల్లిదండ్రుల పాదాలకి నమస్కరించింది. మనస్ఫూర్తిగా వాళ్లు కూతుర్ని దీవించారు. క్యాబ్ రావడంతో సంధ్య తిరుగు ప్రయాణమైంది. మళ్లీ వస్తానని తల్లిదండ్రులకు నచ్చచెప్పి వారి బాధని దూరం చేసే ప్రయత్నం చేసింది.

సంధ్య క్యాబ్ బ్యాక్‌డోర్ తీసి సర్దుకుని లోపలి నుండి తల్లిదండ్రులకేసి చెయ్యి ఊపింది. రఘురాం వెంటనే చేతిలోని మొబైల్ తీసి ఫోన్ చేసాడు.

మెల్లగా కారు ముందుకి కదిలింది. రఘురాం ఓ చేత్తో ఫోన్ చెవిదగ్గర పట్టుకుని మరో చేత్తో కూతురికి వీడ్కోలు పలుకుతున్నాడు.

సంధ్య చేతిలోని ఫోన్ స్క్రీన్ మీద గురుబ్రహ్మ అన్న పేరుతో ఇన్‌కమింగ్ కాల్ వచ్చేసరికి చిన్నగా నవ్వుకుంది.

............

సోమవారం ఉదయం! పోలీస్ స్టేషన్ వద్ద జనంతాకిడి ఎక్కువగా వుంది.

గౌరి ఆరోజు చాలా టెన్షన్‌తో పోలీస్ స్టేషన్‌లో అడుగు పెట్టింది.

ఆమె కళ్లు అక్కడ మొట్టమొదటగా వెతికింది వరండాలో వున్న బెంచిని. ఖాళీ బెంచి దర్శనమిచ్చేసరికి ఒక్కసారిగా ఊపిరి తీసుకుంది. చాలా రిలీఫ్‌గా అనిపించింది. వెంటనే ఆమె మొహంలో చిన్న ఆనందం తొంగి చూసింది. మాస్టారి సమస్యని పరిష్కరించానన్న తృప్తి ఆమెలో నెలకొంది. వెంటనే గౌరికి ఆరోజు కనకమహాలక్ష్మితో సీరియస్‌గా డిస్కస్ చేసిన మేటర్ గుర్తుకొచ్చింది.

............

"ఆయన కంప్లైంట్ యివ్వడానికి మీ స్టేషన్‌కి యింకా వస్తున్నారన్నమాట!" మెల్లగా అంది కనకమహాలక్ష్మి.

"అంటే మీకు అంతా తెలుసన్నమాట" అంది గౌరి. కాస్త ఆగి మళ్లీ "మాస్టారి పరిస్థితి చూస్తే చాలా జాలేస్తోంది" అంది గౌరి.

............

కన్నకూతురు అత్తారింటి వేధింపులకి గురై చివరికి వారి చేతిలో ప్రాణం పోగొట్టుకుంది. ప్రస్తుతం భర్తతో సహా అత్తింటివారు మొత్తం జైలుశిక్ష అనుభవిస్తున్నారు. అంతకన్నా ఎక్కువ శిక్ష మేం అనుభవిస్తున్నాం. అల్లారుముద్దుగా పెంచుకున్న కూతురు అనంత లోకాలకి వెళ్లిపోయిందన్న నిజం ఆయన జీర్ణించుకోలేకపోయారు. మానసిక వత్తిడికి లోనై యింకా కూతురు బతికే వుందనీ, అత్తారింట్లో కష్టాలు అనుభవిస్తోందనీ, ఆమెని అత్తింటి చెర నుండి విముక్తి కల్పించాలనే భ్రమలో పోలీస్ స్టేషన్ చుట్టూ తిరుగుతున్నారు. మతిస్థిమితం వుండట్లే.

అయితే కూతురి విషయంలో తప్పా, మిగతా విషయాలలో మామూలుగానే ప్రవర్తిస్తారు. ఊళ్లో ఒకరిద్దరి డాక్టర్లకి చూపించినా ఫలితం శూన్యం.

ఏనాడో నేను చేసుకున్న పాపం.. ఒకవైపు కన్నకూతురు పోయి, మరోవైపు భర్తని ఈ స్థితిలో చూస్తూ" అంటూ కన్నీళ్లు పెట్టుకుంది కనకమహాలక్ష్మి.

ఆమె చెప్పిన విషయం విని గౌరి మనసు చలించిపోయింది. ఉబికివస్తున్న కన్నీటిబొట్లకి ఆమె ధరించిన ఖాకీబట్టలు అడ్డు తగిలాయి.

"లేదమ్మా.. సంధ్యని తీసుకురాలేకపోయినా మాస్టార్ని మామూలు మనిషిని చేసే బాధ్యత నాది. స్టేట్‌లోనే ది బెస్ట్ సైకియాట్రిస్ట్‌ని సంప్రదిస్తా. ఈ సమస్యకి పరిష్కారం దొరక్కపోదు, నన్ను నమ్మండి" అంటూ హామీ యిచ్చి ఆమెని ఊరడించింది.

............

"గుడ్ మార్నింగ్ మేడమ్!" అంటూ మురళి సెల్యూట్ చేసేసరికి ఆలోచనల నుండి ఉలిక్కిపడి ఈ లోకంలోకి వచ్చింది గౌరి. మాస్టారు మామూలు మనిషి కావడానికి సైకియాట్రిస్ట్ చెప్పిన ప్రకారం చేయడంలో తన పాత్రే కాక కనకమహాలక్ష్మి సహకారం చాలా వుందని మనసులో అనుకుంది.

అంతలోనే మురళి పలకరింపు గుర్తుకొచ్చి "గుడ్ మార్నింగ్!" అంటూ మురళిని విష్ చేసింది గౌరి.

"యస్... యివాళ నిజంగా తన జీవితంలో శుభోదయమే" అని మనసులో సంతోషంగా అనుకుంది గౌరి.

**"సంధ్యా, సాయంత్రమే వెళ్లిపోవాలా? ఓ రెండు రోజులు వుండకూడదూ" అన్నాడు రఘురాం. "లేదు నాన్నా.. మా వాళ్లకి వచ్చేస్తానని మాటిచ్చాను. మళ్లీ నేను మిమ్మల్ని చూడటానికి రావాలంటే నా మాట నిలబెట్టుకోవాలి" సమాధానమిచ్చింది సంధ్య.**

జయసూర్య

శతాబ్దాల తరబడి రాజ్యాధిపత్య, దొరల భూస్వామ్య దోపిడీ వ్యవస్థ కబంధ హస్తాలలో, తెలంగాణ సీమ నైజాం హైదరాబాద్ స్టేట్‌గా, తీవ్ర అణచివేత, హింసా దౌర్జన్య దుస్థితి ఎదుర్కొంది.

వట్టికోట ఆళ్వార్‌స్వామి పుట్టి పెరిగిన కాలం, జీవించిన సంధికాలంలో తెలంగాణ సమాజం అమానుష, సనాతన భూస్వామ్య వ్యవస్థపై సంఘర్షణలు ప్రారంభమై పోరాటాలు తల ఎత్తాయి.




# 'ప్రజల మనిషి' ఆళ్వారుస్వామి

తెలంగాణ గ్రామీణ సమాజంలో చైతన్యం రగిలించే లక్ష్యంతో ఆళ్వార్‌స్వామి, మధ్య తరగతి గ్రామీణ రైతాంగాన్ని సామాజిక, రాజకీయ పోరాట దిశలో మలుపు తిప్పిన తెలంగాణ వైతాళికులలో ఒకరుగా తన జీవిత కాలం సాహిత్యం ఆయుధంగా, తొలుత ప్రజాస్వామిక ఉద్యమాలకు, క్రమేపీ కమ్యూనిస్ట్ సాయుధ పోరాటానికి చేయూత అందించారు.

1941 నుంచి సాహితీవేత్తగా కథలు, ఏకాంకికలు, నవలలు, పత్రికా రచనలతో, సమసమాజాన్ని ఆకాంక్షించారు. ఆనాడు అభ్యుదయ రచయితల సంఘం ఆవిర్భవింపచేసి సామాజిక అభ్యుదయానికి, సంస్కరణాయుత గ్రామీణ వికాసానికి కృషి చేసారు. గ్రంథాలయోద్యమం, ఆంధ్ర జన సంఘం, ఆంధ్ర మహాసభ, కాంగ్రెస్, కమ్యూనిస్ట్ ఉద్యమాలు రాజకీయ, సాంస్కృతిక ఉద్యమాలలో కీలకపాత్ర వహించారు. నైజాం రాచరిక వ్యవస్థ, భూస్వామ్య దోపిడీ వ్యవస్థ గ్రామీణ సన్న, చిన్న, మధ్య తరగతి రైతాంగాన్ని పీడించి పిప్పి చేస్తున్న కాలం కావడంతో ఆళ్వార్‌స్వామి జీవన ప్రస్థానం, జాతీయ ప్రజాస్వామ్య పాలనా వ్యవస్థను నెలకొల్పే దిశలో, విప్లవాత్మక సమాజ ఆవిర్భావానికి అంకితమైంది.

వట్టికోట ఆళ్వారుస్వామి జైలులో తనతో శిక్ష అనుభవించే ఖైదీల జీవిత వృత్తాంతాలను 'జైలులోపల' కథలుగా రాసారు.

1938కి పూర్వం నైజాం సంస్థానంలో సామాన్య ప్రజల స్థితిగతులను 'ప్రజలమనిషి' నవలలో చిత్రించారు. పేదరికం, వెట్టిచాకిరి, దొరల దౌర్జన్యం, మతం మార్పిడులు, రైతుల భూమి సమస్యలు 'ప్రజలమనిషి', 'గంగు' నవలలలో చూడొచ్చు. తెలంగాణ పోరాట చరిత్రను మూడు నవలలుగా రాయాలని ఆళ్వారుస్వామి సంకల్పించారు. కానీ రెండో నవల 'గంగు' సగంలో ఉండగానే కన్ను మూసారు. దేశోద్ధారక గ్రంథమాల తరపున జీవన రంగం పేరిట నాటికలను రెండు సంపుటాలుగా ప్రచురింపచేసారు. 'ఉదయ ఘంటలు' కవితా గేయాల సంకలనం, తెలంగాణ పేరుతో చరిత్ర, సంస్కృతికి సంబంధించిన వ్యాస సంపుటి తెలుగులో ప్రచురణలను ఒక ఉద్యమంగా నడిపిన సాహితీవేత్త. గ్రంథాలయోద్యమం చేత ప్రభావితుడై స్వయంకృషితో చదువుకొని ప్రజలను చైతన్యవంతులను చేయాలని, గ్రంథమాల తరపున ప్రచురించిన పుస్తకాలు సంచి భుజాన వేసుకొని, కష్టనష్టాలతో సంచరించేవారు.



సామాజిక, రాజకీయ దురాచారాలను విమర్శిస్తూ 'రామప్ప రభస' వ్యాసాలు ధారావాహికంగా మచిలీపట్నం తెలుగు విద్యార్థిలో వచ్చాయి.

1944లో ఆంధ్ర మహాసభ చీలినప్పుడు, ఆళ్వారుస్వామి రావి నారాయణరెడ్డి, బద్దం ఎల్లారెడ్డి పక్షంలో నిజాం వ్యతిరేక పోరాటంలో పాల్గొన్నారు. 1942 క్విట్ ఇండియా ఉద్యమంలోను, 1946-51 సాయుధ పోరాట కాలంలో, నైజాం వ్యతిరేక పోరాటాలలో కఠినమైన జైలుశిక్షలు అనుభవించారు. స్టేట్ కాంగ్రెస్, ఆర్య సమాజం, ఆంధ్ర మహాసభ, కమ్యూనిస్ట్ సాయుధ పోరాటం, కార్మిక ఉద్యమాలు, అభ్యుదయ రచయితల సంఘం, ఆళ్వార్ స్వామిని నడిపించాయి. 1945 తరువాత తెలంగాణ రాజకీయ పరిణామాలను చూపించే అవకాశం 'ప్రజల మనిషి' నవలలో లేకపోయినా 'గంగు' నవలలో సాయుధ పోరాట కమ్యూనిస్ట్‌ల తిరుగుబాటు వచ్చే సూచనలున్నాయి.

1915 నవంబరు 1న నల్గొండ జిల్లా నకిరేకల్ మండలం చెరువు మాదారంలో జన్మించిన తెలంగాణ వైతాళికుడు వట్టికోట ఆళ్వార్‌స్వామి 1962 ఫిబ్రవరి 5న కన్ను మూసారు.

తెలంగాణ సీమకు సంబంధించి తొలి రాజకీయ నవలగా 'ప్రజల మనిషి' గుర్తింపు పొందింది. నిజాం నిరంకుశ పాలనకు, ఆనాడు దొరలు సాగించిన అరాచకాలకు ఈ నవల అద్దం పడుతుంది. పీడిత ప్రజల పక్షాన, ఆనాటి గ్రామీణ పేద రైతాంగం ఆశలను, ఆకాంక్షలను ఆళ్వారుస్వామి ప్రతిబింబింపచేసారు. కంఠీరవం, కొమరయ్య, బషీర్, సుజాత, కమల, నవనీతం వంటి పాత్రల వారసులే తదనంతర తెలంగాణ ప్రజా పోరాట ఉద్యమాలలో గళం విప్పారు. వట్టికోట ఆళ్వార్‌స్వామి ప్రశ్నించే సమాజాన్ని, నాడే అభిలషించారు.

1947లో కమ్యూనిస్టు పార్టీ కార్యకర్తగా మూడేళ్ల జైలుశిక్ష అనుభవించారు. నిజాం పాలనా కాలంలో రాజకీయ దాస్య శృంఖలాలను తెంపి, తెలంగాణ జీవన ఔన్నత్యాన్ని చైతన్యపరిచి భూస్వామ్య వ్యవస్థను కూలదోసి, జనస్వామ్య పాలనా వ్యవస్థ ఆవిర్భావానికి జీవితాంతం శ్రమించిన త్యాగజీవి వట్టికోట ఆళ్వార్‌స్వామి చిరస్మరణీయులు.

# మృదు నైపుణ్యాలు

దాసరి శివకుమారి

**తరగతి గదిలో చాలా మంది విద్యార్థులుంటారు. ఉపాధ్యాయుడు అందరికీ ఒకే రకంగా పాఠాలు చెప్తారు. కానీ కొందరు దానిని బాగా గ్రహించగలరు. మరికొందరు ఒక మాదిరిగా గ్రహిస్తారు. ఇంకొందరి మెదళ్లకు ఏ విషయమూ చేరదు. అలాంటివారు ఎందుకూ పనికిరాని మొద్దులుగా అనిపిస్తారు.**

దీనికి ప్రధాన కారణం.. పాఠాన్ని మనసు పెట్టి వినే శ్రద్ధ లేకపోవటం. విషయం మీద ఆసక్తి లేకపోవటం. ఇవన్నీ కారణాలవుతున్నాయి. మరో ప్రధాన కారణం.. తరగతి గదిలో విని వచ్చినదాన్ని ఇంట్లో అభ్యాసం చేయకపోవటం.

అభ్యాసమంటే ఇక్కడ ఒక ప్రాచీన విషయాన్ని మనం గుర్తు చేసుకోవచ్చు. విద్య ఏమాత్రం వంటబట్టని ఒక విద్యార్థిని గురుకులం నుండి గురువుగారు ఇంటికి పంపేస్తారు. చేసేదేం లేక శిష్యుడు ఇంటిదారి పట్టాడు. అతడు దారిలో మంచినీళ్ల కోసమని ఒక బావి దగ్గర ఆగాడు. నీళ్లు తోడుకుందామని బావి గట్టున పెట్టిన వున్న కడవను పైకెత్తితే కడవ వుంచిన చోట రాతి మీద కోసుకుపోయి కడవ పెట్టిన గుర్తు కనపడింది. అలాగే నీళ్ల తోడే చేంతాడును పైకి తీస్తే తాడును పెట్టిన చోట కూడా గుర్తు కనపడింది. మాటి మాటికీ అందరూ వాడి-కడవను, తాడునూ ఒకే చోట వుంచినందువలన కఠినమైన రాయి మీద కూడా గుర్తులు పడ్డాయి. అలాగే మళ్లీ మళ్లీ చదివితే నా మనసులో మాత్రం చదువుగుర్తులు ఎందుకు పడవు? అన్న ఆలోచన అతనికి వచ్చింది. వెంటనే వెనుదిరిగి గురుకులానికి వెళ్లాడు, అక్కడే వున్నాడు. పట్టుదలతో చదివి అపార విద్యావంతుడయ్యాడు. అతడే మొదట వరదరాజ్ అనే మందకొడి విద్యార్థి. ఆ తర్వాత దేశానికే గర్వకారణమైన 'అష్టాధ్యాయి' అనే వ్యాకరణ గ్రంథాన్ని రాసి 'పాణిని'గా ప్రసిద్ధుడయ్యాడు.

సాధారణంగా ఆఫీసుల్లో చాలా మంది ఉద్యోగులు పని చేస్తూ వుంటారు. కొందరి పని చురుగ్గా, మరికొంతమంది పని మందకొడిగా వుంటుంది. సహజంగా చురుగ్గా వుండేవారి మీద పైవారికి మంచి అభిప్రాయం కలుగుతుంది. వారికి త్వర త్వరగా పదోన్నతి కల్పిస్తారు. ఏ రంగంలో పనిచేసేవారైనా కొందరు మొక్కుబడిగా, కేవలం జీతం కోసమే పని చేస్తారు. కానీ మరికొందరు తమ వృత్తి పట్ల అంకిత భావంతో పని చేస్తూ తమ పనిలో లీనమవుతారు. ఇలాంటి అంకిత భావం ముఖ్యంగా ఉపాధ్యాయులకు చాలా అవసరం. వారు తాము బోధించే విషయాన్ని గురించి ముందుగా ఒక ప్రణాళిక



వేసుకుని, ఆ విషయాన్ని బాగా ఆకళింపు చేసుకుని ఆ తర్వాత విద్యార్థులకు, బోధిస్తే పాఠం విద్యార్థుల మనసుల్లో హత్తుకుపోతుంది. వారి మనసుల్లో ఆ ఉపాధ్యాయులు చిరస్థాయిగా నిలిచిపోతారు. భావిభారత పౌరులను తయారు చేసేది ఉపాధ్యాయులే. వారి శిక్షణలోనే తరగతి గదిలో దేశ భవిష్యత్తు నిర్మితం అవుతుందని మేధావులు చెప్తున్నారు గదా!

ప్రస్తుత కాలానికి వస్తే ఇప్పుడు ఎక్కువ మంది మనసుల్లో సాఫ్ట్‌వేర్ రంగం రాజ్యమేలుతున్నది. సాఫ్ట్‌వేర్ ఉద్యోగమే బోలెడు సంపాదనను తెచ్చిపెడుతుందన్న అభిప్రాయమే బలంగా కనపడుతున్నది. కాబట్టి ఆ ఉద్యోగం తెచ్చిపెట్టే చదువుకే విద్యార్థులూ, తల్లిదండ్రులూ ప్రాధాన్యతనిస్తున్నారు. అన్ని చదువుల్లోలాగా ఇక్కడా చురుకైన విద్యార్థులూ, మందమతి విద్యార్థులూ వుంటున్నారు. మందమతులు మళ్లీ, మళ్లీ తప్పి చివరికెలాగో కోర్సు పూర్తి చేస్తున్నారు. వారు తమ మార్కులకు తగ్గట్లుగా చిన్నా, చితకా ఉద్యోగాలకే పరిమితమవుతున్నారు. కొందరు 95, 96 శాతం మార్కులు తెచ్చుకుని బాగా తెలివిగలవారిగా ముద్ర పడుతున్నారు. పెద్ద పెద్ద కంపెనీలలో ఉద్యోగాలు తెచ్చుకోగలుగుతున్నారు. తనకిచ్చిన ప్రాజెక్టులు అందునా తన టీమ్ లీడర్ ఇచ్చిన సూచనలతో బాగానే నెట్టుకురాగలడు. కానీ కొన్నాళ్లకు తానే టీమ్ లీడర్‌గా వ్యవహరించాల్సి వస్తుంది. ఇక్కడ మాత్రం కొందరు రాణించలేకపోతున్నారు. కారణమేంటంటే ఆ పని చేయటానికి కావలసిన 'మృదు నైపుణ్యాలు' అతనిలో లోపించటం. ఆ 'మృదు నైపుణ్యాలు' కొన్నింటిని గురించి ఆలోచిద్దాం:


1) బలమైన కోరిక, 2) గట్టి నమ్మకం, 3) పట్టుదలగా పనిచేయడం, 4) సామర్థ్యం, 5) దూరదృష్టి

ఇవి ప్రధానమయినవి. అయితే వీటికి అనుబంధంగా మరికొన్నింటిని కూడా అలవరచుకోవాలి. మనిషిలో అంతర్లీనంగా ఎన్నో శక్తులు దాక్కుని వుంటాయి. జాగ్రత్తగా వాటిని ఒడిసిపట్టుకుని ఉపయోగించుకున్నవారు రాణిస్తున్నారు. ఒక పని పూర్తి చేయాలన్న బలమైన కోరిక వుండాలి. నా లక్ష్యం వైపుకు నేను చేరుకోవాలి.

అలా చేరుకోవటానికి ఏ పరిస్థితి ఎదురైనా తట్టుకుంటాను. పర్వత శిఖరాలు చేరుకునేవారికి ఆ పర్వత శిఖరం చేరుకోవాలి. అక్కడ నా జాతీయ జెండాను రెపరెపలాడించాలన్న బలమైన కోరిక ఉంటుంది. అతనికి దారిలో ఎన్ని గాలుగు వీచినా, వానొచ్చినా, వరదొచ్చినా, రాళ్లు దొర్లిపడినా లెక్కచేయకుండా ముందుకే దారి తీస్తాడు.

మొదట్లో ఏ పనైనా మొదలుపెట్టినప్పుడు కాస్త భయంగానే వుంటుంది. కానీ ఆ భయాన్ని జయించి నేను ముందుకు వెళ్లగలను, అనుకున్న పనిని పూర్తి చేయగలను.. అన్న గట్టి నమ్మకం తనకు తానే కల్పించుకోవాలి.

పట్టుదల కూడా మనిషి ఎదుగుదలకు చాలా ముఖ్యం. ఒకసారి ఒక పనిలో విజయం సాధించలేకపోయినా నిరాశపడిపోకూడదు. పట్టుదలగా మళ్లీ మళ్లీ ప్రయత్నిస్తూనే వుండాలి. మన



శాస్త్రవేత్తలు తమ తమ ప్రయోగాల్లో ఎన్నో సార్లు విఫలమైనా మళ్లీ మళ్లీ పట్టుదలగా పని చేసి ఫలితాలను రాబట్టారు.

పై మూడింటిని సక్రమంగా నెరవేర్చే సమర్థత కూడా వుండటం చాలా అవసరం. తాను సమర్థంగా పని చేసి తన తోటివారికి ఆదర్శంగా నిలవాలి. సమర్థతను పెంచుకోవటానికి తన ముందటివారి ఆలోచలను తెలుసుకోవాలి. ప్రపంచంలో ఎప్పటికప్పుడు జరిగే మార్పుల పట్ల దృష్టి పెట్టాలి. పుస్తకాలను ఎక్కువగా చదవాలి.

వీటన్నిటికీ మించి ముఖ్యంగా ఒక టీమ్ లీడర్‌గా పని చేసే వ్యక్తికి దూరదృష్టి చాలా అవసరం. దూరదృష్టితో కూడా విభిన్నమైన ఆలోచనలు చేయగలగాలి. మూస ఆలోచనా ధోరణిని అవలంభించకుండా కొత్తగా ఆలోచించగలగాలి. మిగతావారు నడిచిన దారిలోనే కాకుండా తాను భిన్నంగా, కొత్తగా ఆలోచించి తాను పని చేసే కంపెనీ సామర్థ్యాన్ని పుంచేటట్లుగా వుండాలి. ప్రత్యేకమైన గుర్తింపు తెచ్చుకోవాలన్న తపన కలిగి వుండాలి. ఇక్కడ తన మెదడుకు ఇంకా బాగా పదును పెట్టాల్సి వస్తుంది.



బలమైన కోరికకు గట్టి నమ్మకానికి, పట్టుదలగా పని చేయటానికి, సామర్థ్యానికి, విభిన్నమైన దూరదృష్టి వుండటం చేతికి బొటనవేలు వంటిది. ఈ బొటనవేలి సహాయంతోనే మనం దాదాపు 32 పనులు చేయగలుగుతున్నాం. డాక్టరు నేర్పుగా శస్త్రచికిత్స చేయాల్సి వచ్చినా, సాహిత్య తన రచనను సృజించవలసి వచ్చినా, కళాకారుడు తన కళను ఆవిష్కరించవలసి వచ్చినా స్త్రీ చక్కని ఎంబ్రాయిడరీ పని చేయాలన్నా, ఇంకా ఇలాంటి పనులెన్నింటికో బొటనవేలే ముఖ్యం. కాబట్టి ఈ బొటనవేలు వంటి దూరదృష్టితో కూడిన విభిన్నమైన ఆలోచన మనిషిని ముందుకు నడిపిస్తుంది. అది వుండబట్టే టాటా కంపెనీవారు, రిలయన్స్ లాంటివారు అంతగా తమ వ్యాపార రంగంలో దూసుకెళ్తున్నారు. పైన చెప్పిన మృదు నైపుణ్యాలే కాక ప్రతిఒక్కరికీ సమయపాలన అనేది చాలా అవసరం.

టీమ్ లీడర్ విషయానికొస్తే వారు ఎదుటివారితో నేర్పుగా మాట్లాడి పని చేయించుకోవాలి. ఏదైనా సహాయం చేయలేనప్పుడు కూడా సున్నితంగా ఆ విషయం చెప్పాలి.

నాయకత్వం వహించేవారికి ఎదుటివారి అభిప్రాయాలు కూడా తెలుసుకోవటం చాలా అవసరం. అంతా తనకే తెలుసు, తనే బాస్, తను చెప్పేదే శాసనం.. అన్నట్లుగా వుండకూడదు. టీమ్‌లోని అందరి ఆలోచనలనూ పరిగణనలోకి తీసుకోవాలి. ఏదైనా బాగుందని అనిపిస్తే వారిని అభినందించాలి. తరచూ సమావేశాలు ఏర్పాటు చేసి, వారు వెలిబుచ్చిన మెజారిటీ అభిప్రాయాలకు విలువ ఇవ్వాలి. ఏ కొత్త ప్రాజెక్టు వచ్చినా టీమ్‌లోని అందరి అభిప్రాయాలూ తెలుసుకోవాలిగానీ ఒంటెత్తు పోకడలు పోగూడదు. వీటిని అలవర్చుకుని ముందుకు అడుగేసినపుడు తనతో పాటు తన సంస్థనూ వెలుగులోకి తప్పకుండా తీసుకుని రాగలరు ఏ టీమ్ లీడర్‌లయినా.

## సరదా రచనలకు ఆహ్వానం

జోక్స్, ప్యారడీ పాటలు, సరదా అనుభవాలు, పంచ్ డైలాగులు వగైరాలు పంపితే పరిశీలించి, బాగుంటే ప్రచురిస్తాం. దయచేసి కాపీ రచనలు పంపకండి. మీ రచనలు పంపించవలసిన చిరునామా: నవ్వుల్.. రువ్వుల్, ఎడిటర్, ఆదివారం వార్త, నం.396, లోయర్ ట్యాంక్‌బండ్, హైదరాబాద్-500 080.

sunmagvaartha@gmail.com

# సద్గుణం

యామిజాల జగదీశ్

అనగనగా ఓ ఊళ్లో ఒకరున్నారు. ఆయనది బట్టల వ్యాపారం. ఆయన దుకాణానికి వివిధ ప్రాంతాల నుంచి బట్టలు తెస్తుంటారు.

రకరకాల వస్త్రాలు దిగుమతి చేయించుకుని వ్యాపారం చేయడం ఆయన పని.

ఓరోజు ఆయన దుకాణానికి ఓ వృద్ధురాలు వచ్చారు. ఆమె వస్తూ వస్తూ ఓ పట్టుచీరె తీసుకొచ్చారు. అది చాలా పాతది.

దానిని ఆ దుకాణం యజమానికి చూపించారు.

“అయ్యా, ఈ పాత చీరెను మీరు తీసుకుంటారా?” అని అడిగింది.

ఆ దుకాణంలో పని చేస్తున్న మనిషి ఆ వృద్ధురాలిని విచిత్రంగా చూస్తున్నాడు.

ఆవిడకు విషయం తెలీదేమో అనుకున్నాడు ఆ ఉద్యోగి. అవును, అతనలా అనుకోవడంలో తప్పేముంది.

కొత్త చీరెలు అమ్మే దుకాణం తప్ప అది పాత చీరెలు కొనే దుకాణం కాదుగా. అటువంటప్పుడు ఈ పాత చీరెలను ఎవరైనా కొంటారా?

అందుకే ఆ ఉద్యోగి ఆమె వంక విచిత్రంగా చూసాడు.

“సరే, యజమాని ఏం చెప్తారా?” అని చూస్తున్నాడు ఆ ఉద్యోగి.

యజమాని ఆ వృద్ధురాలిని కింద నుంచి పై వరకూ చూసి “అమ్మా, ఈ చీరెకు ఎంత కావాలి? అని అడిగారు ఆ వృద్ధురాలిని.

“దీనికి ఓ అయిదు వందలు కావాలి” అని అడిగింది వృద్ధురాలు.

ఆ మాటకు యజమాని చిన్న నవ్వు నవ్వి తన నౌకరు వంక చూసారు.

“ఈవిడకు అయిదు వందలు ఇచ్చి పంపించు” అన్నారు యజమాని.

నౌకరుకి ఆశ్చర్యం వేసింది. ఏమిటిది... ఆవిడ పాత చీరెకు అయిదు వందలు అడిగితే యజమాని అంత డబ్బు ఇమ్మంటున్నారేమిటి? అనుకున్నాడు మనసులో.

ఆవిడకు వినిపించకుండా యజమానితో అంత డబ్బు ఇవ్వాలా? అని పాత చీరె వంక చూసాడు.

అప్పుడు ఆ యజమాని ఇలా చెప్పారు.

“మాట్లాడకుండా నేను చెప్పింది చెయ్యి. నువ్వు చీరెను చూస్తున్నావు. నేను ఆ వృద్ధురాలిని పేదరికాన్ని చూస్తున్నాను” అన్నారు యజమాని.



దాంతో ఆ నౌకరు ఇంకేమీ మాట్లాడలేదు.

డబ్బు తీసి ఆవిడకు ఇచ్చాడు. ఆవిడ మనసు తృప్తి పడింది. పేదరికానికి ఖరీదు ఇంత అని ఎలా వెలకట్టగలం....

“మంచి గుణాలేవీ...?” అని కొందరు ఓ గురువుగారిని అడిగారు.

వారి ప్రశ్నకు ఆ గురువుగారు జవాబిస్తూ ఏం చెప్పారో తెలుసా?

“ఐకమత్యంగా ఉండటం, సత్కార్యాలు చేయడం, ధర్మం చేయడం, నమస్కరించడానికి ఆలోచించకపోవడం, అనారోగ్యంతో బాధపడుతున్న వారిని వెళ్లి పలకరించడం, ధైర్యం చెప్పడం, భరోసా ఇవ్వడం, అంతిమ యాత్రలో పాల్గొనడం, కుల మతాలకు అతీతంగా వ్యవహరించడం, అందరినీ కలుపుకోవడం. ప్రేమగా ఉండటం, వృద్ధుల పట్ల మర్యాదగా ప్రవర్తించడం, ఘర్షణలకు దూరంగా ఉండటం, కోపాన్ని నియంత్రించుకోవడం, ఇద్దరి మధ్య తగవు తీర్చగలిగితే తీర్చడం, గర్వం లేకుండా ఉండటం... ఇటువంటివన్నీ సద్గుణాలు” అని గురువుగారు చెప్పారు.

ఆ క్రమంలోనే ఆ యజమాని ఆ వృద్ధురాలికి సాయం చేశారు. అంతేతప్ప మరొకటి కాదు.

కానీ అలా ఉండటం అంత సులభం కాదు కదా!

నాకు తెలిసిన ఒకరున్నారు. ఆయన దుకాణంలో లేని సమయం చూసుకుని ఒకడు ఆ దుకాణంలోకి వెళ్లాడు.

అక్కడ పని చేస్తున్న మనిషిని చూసి “ఓ కోడి ఉంది.. కొనుక్కుంటారా?” అని అడిగాడు.

“ఎంత?” అని అడిగాడు అక్కడ పని చేస్తున్న మనిషి.

“పది రూపాయలు” అన్నాడు అతను.

“ధర చాలా తక్కువగా ఉందనుకుని”, “సరే.. ఓ కోడినివ్వు” అన్నాడు.

వెంటనే ఆ మనిషి ఓ పేపరు తీసి ఆ పనిమనిషికి ఇచ్చాడు.

“కోడి ఎక్కడ?” అని అడిగాడు ఆ పనిమనిషి.

అతను “ఆ పేపరులో వేసుందిగా.. చూడు” అన్నాడు.

పనిమనిషి చూశాడు. ఆ కాగితంలో కోడిబొమ్మ వేసి ఉంది.

“సరే ఇదిగో పది రూపాయలు” అని ఓ కాగితం ఇచ్చాడు.

తీరా ఆ కాగితంలో ఏముందంటే పది రూపాయలని రాసి ఉంది.

దాంతో కోడి ఉందంటూ అమ్మడానికి వచ్చిన వ్యక్తి ఇంకేమీ మాట్లాడకుండా వెళ్లిపోయాడు.

ఇది జరిగిన కాస్సేపటికి ఆ దుకాణం యజమాని వచ్చాడు.

పనికుర్రాడితో మాట్లాడుతూ జరిగినదంతా తెలుసుకున్నాడు.

యజమాని అతని చెంప ఛెళ్లుమనిపించాడు.

నౌకరుకి ఏమీ అర్థం కాలేదు. “నేనేమీ నిజమైన పది రూపాయలు ఇవ్వలేదు కదండీ!” అన్నాడు అమాయకంగా మొహం పెట్టి.

అప్పుడు యజమాని ఇలా అన్నాడు..

“పది రూపాయలు అని కాగితంలో ఎందుకు రాసిచ్చావు. ఇందువల్ల ఓ చీటి వృధా అయింది కదా. పది రూపాయలని నోటితో చెప్పి పంపించేస్తే సరిపోయేదిగా, పేపరు వేస్ట్ అయ్యేది కాదుగా” అని మరొక్కసారి అతని చెంప ఛెళ్లుమనిపించాడు.



## వారఫలం

శ్రీమతి ములుగు శివజ్యోతి, ప్రముఖ జ్యోతిష్కురాలు
నారాయణ నాయక్ కాంప్లెక్స్, 2వ అంతస్తు,
గాంధీ జ్ఞానమందిర్ వెనుక, కోఠి, హైదరాబాద్-1
ఫోన్: 9849453449, 9440927795

### మేషం



చాలా విషయాలను స్వార్థం కోసం కాకుండా మాన వీయ కోణంలో చూస్తారు. సామాజిక స్పృహతో ఇతరు లకు మేలు చేస్తారు. పెద్దవాళ్ల చేసిన పెద్ద తప్పులను క్షమిస్తారు. విద్యా, సాహిత్య కళా రంగాలలో ప్రఖ్యాతి సాధిస్తారు. మీడియా పరంగా లాభపడతారు. మీ శక్తి సామర్థ్యాలకు తగిన ఉద్యోగం లభిస్తుంది. మీ కృషికి దైవానుగ్రహం కావాలని ప్రార్థిస్తారు.

### వృషభం



దొంగ స్వామీజీల వల్ల నష్టపోతారు. ఆధ్యాత్మిక విషయంలో ఎలాంటి విధానాన్ని అవలంబించాలో తెలి యని అయోమయ స్థితి ఏర్పడుతుంది. సంతాన పురోగతి సంవ త్సర ద్వితీయార్థంలో బాగుంటుంది. అపాత్రదానం చేసి దుర్మార్గు లకు సహాయం చేస్తారు. మీకు తెలియకుండా జరిగిన తప్పిదం వల్ల ప్రత్యక్షంగా గానీ, పరోక్షంగా గానీ మీరు జవాబుదారీ అవుతారు.

### మిథునం



వ్యవసాయ సంబంధమైన ఉత్పత్తులు,ధాన్యపు వ్యాపా రులకు, ఎరువుల వ్యాపారులకు అనుకూల ఫలితాలు సూచిస్తాయి. ప్రకృతి వైపరీత్యాల నుండి బయట పడతారు. కుటుంబ పరంగా ఉన్న సమస్యలు కొన్ని పరిష్కారమవుతాయి. స్త్రీల వల్ల మానసిక ప్రశాంతత కరువవుతుంది. సంతాన విషయాలు ఆందోళనకు గురి చేస్తాయి. కోర్టుల వల్ల ఉపశమనం లభిస్తుంది.

### కర్కాటం



అన్ని విషయాల్లోనూ కొన్ని ఆటంకాలు ఎదురైనా కార్య విజయం లభిస్తుంది. మీ విజయాన్ని, సామర్థ్యాన్ని చూసి మనస్ఫూర్తిగా సంతోషించేవాళ్ల తక్కువగా ఉంటారు. మీరు సాధించిన ఉన్నతి చూసి నిజంగా సంతోషించే ఆత్మీయుడు లేకపోవడం మీ మనోవేదనకు కారణం అవుతుంది. ఎగుమతి, దిగుమతి వ్యాపారాలు బాగుంటాయి.

### సింహం



ఆర్థిక క్రమశిక్షణ అమలు చేయాలని గట్టి ప్రయత్నం చేస్తారు. అనుకోని ఖర్చులు వచ్చి పడతాయి. మీ వ్యాపార సంస్థ గుడ్ విల్ పెరుగుతుంది. ఇన్సూరెన్స్ చేయడం వంటి కొన్ని ముఖ్యమైన పనులను నిర్లక్ష్యం చేయకండి. ప్రభుత్వ సంబంధమైన లీజులు, రెన్యువల్స్ లాభిస్తాయి. కొన్ని సందర్భాల్లో మీ మనస్సాక్షికి విరుద్ధంగా ప్రవర్తిస్తారు.

### కన్య



మిశ్రమ ఫలితాలు పొందుతారు. కీలకమైన వ్యవహా రాలలో నిదానంగా మెలగడం మంచిది. ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా వుంటుంది. వృత్తి, ఉద్యోగాల పరంగా సాధార ణంగా ఉంటుంది. వ్యాపారస్తులకు రాబడి తక్కువగా ఉంటుంది. కళా, సాంస్కృతిక, సాహిత్య రంగాలలోని వారికి మధ్యస్థ ఫలితాలు ఉంటాయి. ప్రయాణాలు వత్తిడికి కారణమవుతాయి.

### తుల



క్రమశిక్షణకు ప్రాధాన్యమివ్వడం మంచిది. ఆర్థిక పరమైన అంశాలు సున్నితమైన వ్యవహారాలతో ముడి పడి వుంటాయి. ప్రతి పనిని కష్టించి సాధించుకోవలసి వస్తుంది. ఉన్నత విద్యా, ఉద్యోగ ప్రయత్నాలు ప్రయాస మీద సానుకూల పడతాయి. దురభ్యాసాలకు, విందు, వినోదాలకు దూరంగా వుండండి. వ్యాపార విస్తరణకు చేసే ప్రయత్నాలు సానుకూలంగా ఉంటాయి. సహోదరి వర్గంతో సంయమనంతో వ్యవహరించండి.

### వృశ్చికం



వృత్తి, ఉద్యోగాల పరంగా సానుకూల ఫలితాలు సాధిస్తారు. వైద్యుణ్ణి మార్పు చేసి లాభపడతారు. సంఘసేవా కార్యక్రమాలలో చురుగ్గా పాల్గొంటారు. పనుల వత్తిడి అధికం. అయినా సంతృప్తికరమైన ఫలితాలు సాధిస్తారు. ఆర్థిక విషయాలలో కొంత పురోగతి సాధిస్తారు. నూతన గృహం కొనుగోలు సానుకూల పడుతుంది. జటిలమైన సమస్యలను పరిష్కరించుకోవడానికి మొండిధైర్యం కనబరుస్తారు.

### ధనుస్సు



మిశ్రమ ఫలితాలు పొందుతారు. నూతన వస్తు, వస్త్రాలను కొనుగోలు చేస్తారు. పెద్ద మొత్తంలో పెట్టే పెట్టుబడులు వాయిదా వేయడం మంచిది. వ్యవహారాలలో స్పష్టత లోపిస్తుంది. సమస్యలకు తాత్కాలికమైన పరిష్కారాలే తప్ప పరిష్కార మార్గాలు లభించవు. ఖర్చులు అధికంగా వున్నప్పటికీ నేర్పుగా సర్దుబాటు చేసుకుంటారు. మీ ప్రయత్నం లేకుండానే అనవసరమైన వివాదాలు చోటు చేసుకుంటాయి.

### మకరం



ఆర్థికంగా చెప్పుకోదగిన ఇబ్బందులేవీ ఏర్పడవు. తనఖా వస్తువులను విడిపిస్తారు. విదేశీయాన వ్యవహారాలు సాను కూలపడతాయి. శుభ కార్య చర్చలు ఫలిస్తాయి. మిత్ర బృందంలోకి కొత్తవారిని చేరుస్తారు. సంతాన విద్యా విషయాల పైన దృష్టి కేంద్రీకరిస్తారు. సెంటిమెంట్ వస్తు భద్రత పట్ల జాగ్రత్తలు పాటించండి. మీకు మేలు చేకూర్చే ఉత్తర్వులు అందుకుంటారు. రుణాలు ఇవ్వడం, తీసుకోవడం రెండూ కలిసిరావు.

### కుంభం



ఆర్థిక వ్యవహారాల్లో ఆచి తూచి వ్యవహరించడం మంచిది. వృత్తి, ఉద్యోగాల పరంగా అధికంగా శ్రమిస్తారు. అనుకూలమైన ఫలితాలు ఆలస్యంగా అందుకుంటారు. జీవిత భాగస్వామితో మాట్లాడేటప్పుడు సంయమనం పాటించండి. దూర ప్రాంత ప్రయాణాలు చేయాల్సి వస్తుంది. ఆరోగ్యం నలతగా ఉంటుంది. రుణాల చెల్లింపుకై వత్తిడి అధికమవుతుంది.

### మీనం



మిశ్రమ ఫలితాలు గోచరిస్తున్నాయి. ఆర్థిక వ్యవహారాలు అదుపులో ఉంటాయి. వీసా, పాస్‌పోర్ట్ వంటి దూర ప్రాంత వ్యవహారాలలో సాంకేతిక లోపాలు చోటు చేసుకుంటాయి. వివాదాలు ప్రధాన ప్రస్తావనాంశాలవుతాయి. వ్యాపారస్తులకు లాభాలు రొటేషన్ల రూపంలో ఉంటాయి. వృత్తి, ఉద్యోగాల పరంగా మీ స్థాయి పదిలంగా ఉంటుంది. బంధువర్గంలోని వారితో మాట పట్టింపులు చోటు చేసుకుంటాయి.

**వాస్తువార్త**

**వాస్తు విద్వాన్ సాయిశ్రీ**

**డా॥ దంతూరి పండరినాథ్**

**3-2-4**, కింగ్స్‌వే, సికింద్రాబాద్

సెల్స్: **9885446501/9885449458**




# ఆగ్నేయంలో ఇల్లు నిర్మించవచ్చా?

ఎన్.వెంకటేశ్వర్లు – కాకినాడ

ప్రశ్న: మా ఇల్లు వదిలేసి అద్దె ఇంట్లోకి వచ్చాం. మా స్వంత ఇంట్లో వుండకూడదని చెప్పారు. మేం పంపించిన ప్లాను చూసి అందులో మేం వుండొచ్చో లేదో తెలియచేయండి. పాత ఇంటికి ఆగ్నేయం వైపు **600** గజాల దూరంలో **30** సెంట్ల స్థలం వుంది. ఆగ్నేయం వైపు మరో ఇల్లు కట్టుకోవచ్చా?

**జవాబు:** మరుగుదొడ్డి తూర్పు గోడకు తాకకుండా సవరించి, తూర్పు ఈశాన్యంలో నుండి నడక ఏర్పరుచుకుని మీరు ఆ ఇంట్లో వుండవచ్చు. అయితే ఆగ్నేయ దిశలో వున్న స్థలానికి తూర్పు ఆగ్నేయం ఎట్టి పరిస్థితుల్లోనూ పెరిగి వుండకూడదు. అలా పెరిగి వున్నట్లయితే దాన్ని వెంటనే తూర్పు ఈశాన్యం పెరిగేదిగా సవరించుకోవాలి. దక్షిణ ఆగ్నేయ సమకోణంలో పెరిగి వుండటం వలన మంచి ఫలితం ఉంటుంది.

## ఆర్థిక ఇబ్బందులు తొలగేదెలా?

కె.వాసుదేవ్ – విజయవాడ

ప్రశ్న: నన్ను ఉద్యోగం నుండి తీసివేశారు, ఖాళీగా వున్నాను. నేను స్వార్థపరుడిని అనిపించుకోకూడదని ఇల్లు కట్టి అప్పుల్లో మునిగిపోయాను. చాలా ఇబ్బందుల్లో ఉన్నాను. కుటుంబ సభ్యులకు అనారోగ్య సమస్యలు. మా సమస్యలకు పరిష్కారం తెలుపగలరు.

**జవాబు:** ఈశాన్యంలో బావి దగ్గర వున్న బాత్‌రూములు, ఆగ్నేయంలో తూర్పు దక్షిణ గోడలను ఆనుకుని వున్న 'టాయ్‌లెట్స్' తీసేయాలి. తూర్పున నలభై అడుగుల ఖాళీ స్థలం వుంది. ఇంటికి కాంపౌండు గోడకీ మధ్య దక్షిణ కాంపౌండు గోడ ఆనుకుని బాత్‌రూములు, టాయ్‌లెట్స్ నిర్మించుకోవచ్చు. అయితే ఇంటికి వాటికీ మధ్య వదిలే ఖాళీ స్థలం కంటే వాటికీ తూర్పు కౌంపౌండు గోడకూ మధ్య ఎక్కువ ఖాళీ స్థలం తప్పకుండా వదలాలి. ఈశాన్యంలో వున్న దేవుని గదిలో నుండి తూర్పు లేదా ఉత్తర ఈశాన్యంలో ఒక తలుపు తప్పక తెరవండి. పశ్చిమంలో పెంకుటి గదిని డ్రాయింగు రూమ్‌గా మార్చి ఆ గదికి పశ్చిమాన వున్న కిటికీని తలుపుగా మార్చి, ఆ తలుపుకు ఎదురుగా కాంపౌండు గోడకు గేటు అమర్చండి. అప్పుడు మీ ఇంటి స్థలంలో ఈశాన్య, ఆగ్నేయాలలో వున్న దోషం పోతుంది. ఇంటి ఈశాన్యం తెరిపి అవుతాయి. పశ్చిమ వాయవ్యంగా నడక ఏర్పడి చాలా మంచి ఫలితాలు పొందుతారు.



## ఏడు ద్వారాలు ఉండవచ్చా?

జి.ఆకాశ్ – వరంగల్

ప్రశ్న: ఎనిమిది సంవత్సరాల క్రితం మా గ్రామంలో ఇల్లు కట్టాం. ఇల్లు కట్టినప్పటి నుండి మా పరిస్థితులు బాగా లేవు. ఇంటి ముఖ ద్వారం తూర్పు, పడమరరోడ్డు పదిహేను అడుగుల వెడల్పుతో వున్నది. పడమర ద్వారం పక్కన చేతిపంపు ఉన్నది. దక్షిణం వైపు మూడు గజాల ఖాళీ ప్రదేశం ఉన్నది. పడమర ద్వారం రోడ్డుకు ఒక గజం ఎత్తులో ఉంది. ఉత్తరం వైపు అర గజం దూరంలో మురుగు కాలువ వున్నది. ఏడు ద్వారాలు ఉన్నాయి. ఈ విధంగా వుండటం వల్ల ఏమైనా దోషాలున్నాయా?

**జవాబు:** పశ్చిమం వీధి ఒకటే వున్నప్పుడు తూర్పు ముఖద్వారం ఇల్లు కట్టకూడదు. అలా కట్టరు కూడా. ఇంటి ముఖద్వారం నుండి లోపలికి వెళ్లేప్పుడు తూర్పు ముఖంగా వెళ్తారు కనుక అది తూర్పు ముఖద్వారం అని మీరనుకుంటే అది పొరపాటు. పశ్చిమ ముఖద్వారం ఇల్లే అవుతుంది. పశ్చిమాన బోరుపంపు వుండకూడదు. ఈశాన్యంలో బోరు వేయించి ప్రస్తుతం పశ్చిమాన వున్న బోరు మూయించటం మంచిది. పశ్చిమ వాయవ్యంలో ప్రహరీగోడకు ఒక గేటు మార్చి దానికెదురుగా గదులకు తలుపులు ఏర్పరచుకోవటం వల్ల మీ ఇంటివాస్తు చాలా వరకు సవరించబడి మంచి ఫలితాలు పొందుతారు.

## ఇంటి ప్లాను ఎలా ఉంది?

కె.ఎస్.రావు – శంకరంపేట

ప్రశ్న: మా ఇంటి ప్లాను చూసి ఏమైనా వాస్తు దోషాలుంటే సవరణలు సూచించగలరు.

**జవాబు:** దక్షిణం రోడ్డున్న మీ ఇంట్లో వరుస గదులకు తలుపులు నైరుతి గుండా ఉత్తర వాయవ్యానికి వున్నాయి. దక్షిణ నైరుతి ద్వారం నుండి ఇంట్లో నుండి బయటకు వస్తున్నారు.

ఇలా నడవటం వలన మీకు అనారోగ్య పరమయిన సమస్యలు వస్తుండటం పరిపాటి. ద్వారాలను దక్షిణ ఆగ్నేయం నుండి ఉత్తర ఈశాన్యానికి నడక వచ్చేలా మార్చుకోవటం వలన ఆ సమస్య తగ్గుతుంది.


---

ఈశాన్య మూలకు అధిపతి ఈశానుడు. శుభ ఫలితాలనిచ్చే స్థలం. భగవంతుని పటం పెట్టి పూజింపదగిన పవిత్ర స్థలమది. బరువులు మోయలేని సున్నితమయిన తత్త్వం కలిగి సూర్యోదయపు కిరణాలను మొదట ఆహ్వానించే చోటు. ఇది ఆ ఇంట్లో వుండేవాళ్లను అభివృద్ధి పథం వైపు మళ్లిస్తుంది.

ఇలాంటి చోట పెట్టకూడని వస్తువులు పెట్టి, కిటికీలు, ద్వారాలు లేకుండా మూసివేయటం మనిషి చేసే అపచారం. అందువల్ల చెడు ఫలితాలు వస్తాయి. ఆ దిక్కు మనిషిని శాసించటం లేదు. మనిషి ఆ దిక్కును సరయిన విధంగా పని చేసే అవకాశం కల్పించక తన అభివృద్ధిని తానే కుంటుపరుచుకుంటున్నాడు. ఇదే విధంగా మిగతా దిక్కులు కూడా.

# పదరంగం-16

కూర్పు: పోపూరి విశ్వనాథ్



## ఆధారాలు


### అడ్డం

1. హాని, చెరుపు (4)
4. ఒకప్పుడు చెలామణిలో ఉన్న నాణెం(3)
6. నువ్వో నేనో, ఔనో కాదో (4)
8. వృద్ధాప్య మరణం (4)
9. చేత పుచ్చుకునే చిన్నపాటి పాత్ర (2)
10. న్యాయబద్ధత (4)
12. ఒడిపోవడం (4)
13. రోగం (3)
16. తనివి (2)
17. స్వభావం, గుణం (2)
18. ఆటల్లో మోసం (2)
19. పొడుగ్గా పెరిగే ఒక చెట్టు (4)
21. చితి, వాడుక భాషలో విసుగెత్తించే గోడు (2)
22. వెన్ను (2)
23. పలుచని లోహపు పొడి (3)
24. మోసం, నమ్మక ద్రోహం (2)
25. పైన ఈ దేవతలు తిరుగుతుంటారట (3)
26. కత్తితోటిది తిరగబడింది (2)

### నిలువు

1. ఉన్నతోద్యోగి, తెలుగులో ఆఫీసర్ (4)
2. నరకలోకాధిపతి (6)
3. స్విచ్(తెలుగులో) తలకిందులైంది (2)
4. "పైన" పైకొచ్చింది (2)
5. ఇది (పైకి) కొట్టించడమంటే మోసం చేయడం (3)
7. తలపై ధరించే నగ (3)
10. నిరంకుశత్వం (4)
11. తీరిక, సావకాశం (4)
14. ఆనందంతో కలిగే గగుర్పాటు పైకొచ్చింది (4)
15. పైకొచ్చిన గుడి (3)
17. పిదప (4)
18. త్వరగా (3)
20. వేగంగా (3)
22. చెవులు (3)

## పదరంగం-14 జవాబులు



**పదరంగం-14కి జవాబులు పంపించినవారు**

1. యం.వి.రమణకుమారి-హైదరాబాద్; 2. వి.వివేకానంద-హైదరాబాద్; 3.జి.సుబ్రహ్మణ్యం-రాజంపేట; 4.శ్రీరామారావు వెలివెల-పెనమలూరు.

జవాబులు పంపించాల్సిన చిరునామా:


**పదరంగం** ఆదివారం వార్త, నం.396,


లోయర్ ట్యాంక్‌బండ్, హైదరాబాద్-500 080.

పేరు : ............................................

............................................

ఊరు : ............................................


మేము వాడి చూస్తే.. రేపు సరైన వైద్యం అందించొచ్చు కదాని..!!
ప్రిన్సిపాల్
Zakir...


మీ ఎగ్జిట్ పోల్ సర్వేను ఎవరూ పట్టించుకోలేదు గానీ.. బయటకు రండీ!!
Zakir...


సర్‌ప్రైజ్!
Zakir...
DEC-03

# ఈ వారం 'కార్టూన్స్'



ఫోటో ఫీచర్

కేరళలోని ఇడుక్కిలో ఈ మధ్యే ప్రారంభమైన ఈ గాజు వంతెన దేశంలో పొడవైనది. ఎత్తయిన ప్రదేశం నుంచి ప్రకృతి సోయగాలను ఆస్వాదించేలా రూపొందించిన ఈ వంతెన అందరినీ ఆకట్టుకుంటోంది. సముద్ర మట్టానికి 3600 అడుగుల ఎత్తులో నిర్మించిన ఈ వంతెన పొడవు నలభై మీటర్లు. ఈ గాజు వంతెన నిర్మాణం కోసం జర్మనీ నుంచి దిగుమతి చేసుకున్న 35 టన్నుల స్టీలును వినియోగించారట.





